జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 11 జూన్ 2026 | సంపుటి: 19 | సంచిక: 95 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: దశమి - 25:00:48 వరకు నక్షత్రంఉత్తరాభాద్ర - 09:22:30 వరకు కరణంవణిజ - 13:55:11 వరకు, విష్టి - 25:00:48 వరకు పక్షంకృష్ణ యోగంఆయుష్మాన్ - 06:29:28 వరకు, సౌభాగ్య - 28:02:32 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు?

### పాదచారులకు ఇబ్బంది కలిగించడంపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్,జూన్ 10 (ప్రజాజ్యోతి): మెట్రోస్టేషన్ల కింద పాదచారుల కోసం కేటాయించిన ఫుట్‌పాత్ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుపై తెలంగాణ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పాదచారులు నడిచే ప్రాంతాలను లీజుకు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం కీలక

మిగతా1 2లో..

## 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం

### ఐటిని వినియోగించుకోవాలన్న కమిషనర్

హైదరాబాద్,జూన్ 10 (ప్రజాజ్యోతి): ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు పక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ÷ఎధవారం ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఐటి

మిగతా 2లో..



# అత్యధిక కాలం ప్రధానిగా

# మోడీ రికార్డు

- నెహ్రూ రికార్డును తిరగరాసిన మోడీ
- సుపరిపాలన అతిపెద్ద పరీక్ష: మోడీ పోస్ట్
- ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి
- మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి
- మోడీకి వివిధ దేశాల నేతల అభినందనలు
- ఎక్స్ వేదికగా విషెస్ తెలిపిన మెలోనియా
- ఎన్డీయే భేటీలో ప్రధాని మోడీకి అభినందనలు
- వివిధ రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీలు హాజరు

న్యూఢిల్లీ,జూన్10(ప్రజాజ్యోతి): నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరపున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు.

మిగతా 2లో..

## 2047 సంవత్సరం వరకూ మోదీయే దేశ ప్రధాని

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- చారిత్రక మైలురాయిని అధిగమించిన మోడీ
- భారతీయుల ఆకాంక్షలకు ప్రతీక మోడీ
- ఎక్స్ వేదికగా రాంచంద్రారవు అభినందనలు

కరీంనగర్,జూన్10(ప్రజాజ్యోతి): భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను

మిగతా 2లో..



# పుష్కర కాలంలో అనేక మార్పులు

- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు
- ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం



న్యూఢిల్లీ,జూన్ 10 (ప్రజాజ్యోతి): కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయేలో ఉన్న

మిగతా 12లో..



# అభివృద్ధి జరగొద్దని కుట్రలు

- ఫ్యూచర్ సిటీని రద్దుచేస్తామంటే బండకేసి కొడతారు
- టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీ
- ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ, బీఆర్ఎస్ పని
- కడుపులో విషం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారు
- నాలాల కబ్జాలతో హైదరాబాద్ మునిగిపోతోంది
- కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా ఏర్పాటు
- బతుకమ్మకుంటను ఎడ్లకు రాసిచ్చిన కేసీఆర్
- ముఖ్యమంత్రి రాష్ట్ర రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం

**ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సీఎం**



హైదరాబాద్,జూన్ 10 (ప్రజాజ్యోతి): ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు,

మిగతా 12లో..

## దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత

### తమిళ చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి

చెన్నై,జూన్10(ప్రజాజ్యోతి): తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం,

మిగతా 2లో..

## వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

### భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన మెడికల్ బోర్డు

హైదరాబాద్,జూన్10 (ప్రజాజ్యోతి): తెలంగాణలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ పక్రియ పూర్తయింది. తుది మెరిట్ లిస్ట్‌తో పాటు.. ఈ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం విడుదల చేసింది. గత నెలలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3) అభ్యర్థులతో ప్రొవిజినల్ మెరిట్

మిగతా 2లో..




# సంపాదకీయం

## 370 రద్దుతో.. నెహ్రూ రికార్డును అధిగమించిన మోడీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మున్నెన్నడూ చూడని ఒక అరుదైన మైలురాయి ఆవిష్కృతం అయ్యింది. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పేరిట ఏడు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉన్న అత్యధిక కాలం ఎన్నికైన ప్రధాని రికార్డును ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బద్దలు కొట్టారు. ఇక ప్రధానిగా మోడీ సాధించిన విజయాలు అనేకం ఉన్నాయి. ఇవన్నీ కూడా భారతదేశ చరిత్ర గతిని తిప్పేవని చెప్పుకోక తప్పదు. ప్రధానంగా నెహ్రూ 370 ఆర్టికల్ పెట్టి కశ్మీర్‌ను ఇండియాకు దూరం చేస్తే..అదే 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోడీ చారిత్రక నిర్ణయం తీసుకుని, కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా విలీనం చేశారు. అలాగే కాశ్మీర్ ఇప్పుడు సంపూర్ణంగా విలీనం కావడంతో పాటు, అక్కడ వేర్పాటువాద, ఉగ్రవాద మూకలను క్రూకటి వేళ్లతో పెరివేశారు. మోడీ ధృఢ సంకాల్పినికి...చరిత్రాత్మక నిర్ణయానికి ఇది నిదర్శనంగా చూడాలి. పటేల్ తరహాలో దేశంలో ఐక్యత సాధించే యత్నాలను నేటికీ మోడీ కొనసాగించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2014 మే 26న ప్రమాణ స్వీకారం చేసిన మోడీ.. వరుసగా మూడు సార్లు అధికారంలోకి వచ్చి, సందిగ్ధ రాజకీయ పరిస్థితులను దాటుకుంటూ సగర్వంగా 4,399 రోజులు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. తద్వారా దేశ రాజకీయాల్లో ఒకే ఒక్కడుగా కొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో భారత రాజకీయాల్లో జూన్ 10, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోడీ అధిగమించారు. అంతేగాకుండా అందరికీ దూరంగా,అంటరాని పార్టీగా ఉన్న బిజెపిని ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత కూడా మోడీదని చెప్పాలి. అందుకు ఆయనకు కుడిభుజంగా పనిచేస్తున్న అమిత్ షా వ్యూహాలను కూడా తక్కువ చేయలేం. ఈ ఇద్దరి జంట దేశంలో భారతీయ జనతాపార్టీ పునాదులను బలోపేతం చేసిందనడంలో సందేహం లేదు. ఇక మోడీ తీసుకున్న నిర్ణయాల్లో మరోటి అయోధ్య సమస్యకు చెక్ పెట్టడం. రావణ కాష్టంలా ఉన్న అయోధ్య సమస్యను సుప్రీం కోర్టు ముందుంచి పరిష్కరించగలగడం చారిత్రాత్మక విజయంగా చూడాలి. కోటానుకోట్ల హిందువుల గుండెల్లో ఇది చిరస్మరణీయ నిర్ణయంగా నిలిచిపోయింది. ట్రిపుల్ తల్లాక్ వంటి అనాగరిక చట్టాలను కూడా రద్దు చేయడం ద్వారా ముస్లిం మహిళలకు అండగా నిలబడ్డారు. ప్రధానంగా ఉమ్మడి పౌరస్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే.. భారత్‌లో విభజన రాజకీయాలకు చెక్ పడనుంది. అలాగే మహిళా బిల్లును గట్టెక్కించే ప్రయత్నంలో ఓ అడుగు పడింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా యోగా దినోత్సవాన్ని జూన్ 21న నిర్వహించేలా ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం మోడీ ప్రతిభకు నిదర్శనంగా చూడాలి. అలాగే అనేక దేశాల్లో పర్యటించి భారత్ ప్రతిభను చాటడమే గాకుండా ఆయా దేశాలతో సంబంధ బాధంవ్యాలను బలోపేతం చేయడంలో అద్భుత విజయం సాధించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిగా జవహార్‌లాల్ నెహ్రూ దేశంపై తనదైన ముద్ర వేశారు. ఆయన కూడా అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. తొలి ప్రధానిగా నెహ్రూపై దేశ పునర్నిర్మాణ బాధ్యత లు పడ్డాయి. అదే స్వతంత్ర భారతాన్ని పటిష్ఠమైన పునాదులతో పదిలంగా నిర్మించడం.. అంతేకాదు పేదరికంలో మగ్గిపోతున్న, శతాబ్దాల బానిసత్వంతో ఆత్మవిశ్వాసం కోల్పోయిన జాతిని సగర్వంగా తలెత్తుకు నిలిపేలా చేయడం. ఇవి మరే ప్రధానికీ ఎప్పుడూ ఎదురుకాని కఠిన సవాళ్లు అనడంలో సందేహం లేదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్ని సమర్థంగా నిభాయించిన నెహ్రూ.. దేశంపై చెరిగిపోలేని ముద్ర వేశారు. అందుకు ఆనాటి ఉప ప్రధాని పటేల్ చేదోడువాదోడుగా నిలిచారు. సంస్థానాలను విలీనం చేసి దేశాన్ని ఐక్యంగా నిలబెట్టారు. అంతకుముందు స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన నెహ్రూ.. ఆ తర్వాత స్వతంత్ర భారత తొలి ప్రధానిగా.. అటు స్వయంత్ర సమరయోధుల ఆశయ సాధనకు, ఇటు దేశ ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట వేస్తూ.. పాలన సాగించారనడంలో సందేహం లేదు. అయితే పదవీకాలం ప్రకారం ఇన్నాళ్లుగా చెక్కుచెదరని చారిత్రక రికార్డు నెహ్రూ పేరిట ఉండగా ప్రధాని మోడీ ఇప్పుడు దానిని అధిగమించారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజాప్రతినిధిగా ఎన్నికై దేశానికి ప్రధాన మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటిదాకా 15 మంది ప్రధాన మంత్రులు గా ప్రాతినిధ్యం వహించారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో బీజేపీ తరఫున నరేంద్రమోడీ సుదీర్ఘకాలం పనిచేసిన ప్రధానమంత్రిగా అరుదైన రికార్డును కొన్నేళ్ల క్రితమే సొంతం చేసుకున్నారు. ఇప్పుడు నెహ్రూ రికార్డును అధిగమించారు. అలాగే కోట్లాది మంది భారతీయులకు ఆరాధ్యనేతగా ఎదిగారు. ఇది ఆషామాషీ విషయం కాదు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించడం మామూలు విషయం కాదు. ఇది దేశ చరిత్రలోనే ఓ అరుదైన మైలురాయిగా నిలిచిపోనుంది. 2014లో ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన నరేంద్రమోడీ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు ఆయనను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 370 రద్దు, ట్రిపుల తలాక్ రద్దు, అయోధ్య, మహిళా బిల్లు వంటివన్నీ మోడీకి జననీరాజనం పట్టేలా చేసినవే. దేశంలో రాష్ట్రప్రభుత్వ అధినేతగా.. దేశాధినేతగా నరేంద్రమోడీది ఎవరికీ సాధ్యంకాని రికార్డు నెలకొల్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా నరేంద్ర మోడీ దేశానికి రోల్ మోడల్ అయ్యారు. అలాగే ముఖ్యమంత్రి మంత్రి పదవికి రాజీనామా చేసి దేశానికి ప్రధాన మంత్రి అయ్యారు. సమర్థ నాయకత్వం..సుస్థిర పాలనతో భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించారు. 25 ఏళ్ల రాజకీయ అనుభవంతో ప్రభుత్వ పాలనలో వివిధ రికార్డుల్ని బ్రేక్ చేశారు. సరికొత్త రికార్డులను నెలకొల్పి సంచలన నిర్ణయాలకు కారకులయ్యారు. సాంకేతికం గా చూస్తే నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం మోడీ కంటే కచ్చితంగా ఎక్కువే. కానీ నెహ్రూ మొదటి సారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా ఉన్నారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోడీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డు సొంతం అయ్యింది.

## వైద్య కళాశాలల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

మొదటిపేజీ తరువాయి..

జాబితా విడుదల చేసిన బోర్డు.. మే 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టి తాజాగా ఎంపికైన వారి జాబితాను ప్రకటించింది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 34 డిపార్ట్‌మెంట్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో పీడియాట్రిక్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్థీషియా విభాగాలకు సంబంధించి 174 పోస్టుల భర్తీ ప్రక్రియ గతంలోనే పూర్తి చేసిన అధికారులు.. మిగతా 30 విభాగాల్లో 433 పోస్టులకు ఎంపిక ప్రక్రియను తాజాగా పూర్తి చేశారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారందరికీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

## 2047 సంవత్సరం వరకూ మోదీయే దేశ ప్రధాని

మొదటిపేజీ తరువాయి..

'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు ఎన్నికైన ప్రధాన మంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నరేంద్ర మోదీ ఒక చరిత్రాత్మక మైలురాయి అధిగమించారని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆయన 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. 4,399 రోజులు.. భారతీయ చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిన చరిత్రాత్మక రోజులని చెప్పారు. గరీబ్ కల్యాణ్ నుంచి మహిళా సాధికారత వరకు.. రైతుల గౌరవం నుంచి యువతకు అవకాశాల సృష్టి వరకు.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు.. ఆర్థిక వ్యవస్థ ఫార్మలైజేషన్ నుంచి ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం వరకు.. ప్రతి రంగంలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, బలమైన జాతీయ భద్రతా విధానం, నక్సలిజం క్షీణత, ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధి, బలమైన సరిహద్దులు, విస్తృతమైన సామాజిక భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ఆధునికీకరణ, భారత స్టార్టప్ సంస్కృతి ఎదుగుదల.. ఇవన్నీ జాతీయ పునరుజ్జీవనానికి కొత్త యుగాన్ని సూచిస్తున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# అత్యధిక కాలం ప్రధానిగా
# మోడీ రికార్డు

మొదటిపేజీ తరువాయి..

మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం



ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు.
పధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.
ఈ సందర్భంగా వివిధ దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య బలపడుతోన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి నా అభినందనలు. ఇటీవల రోమ్‌లో మళ్లీ మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇరుదేశాల ప్రజల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంయుక్తంగా ప్రారంభించడం కూడా మంచి విషయం' అని మెలోనీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కలిసి ఉన్న ఫొటోను ఆమె పంచుకున్నారు.
'భారత్‌లో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ప్రధాని మోదీకి అభినందనలు. ఈ ఘనత ఆయన దశాబ్దాల ప్రజాసేవకు, నాయకత్వానికి ఒక శక్తిమంతమైన నిదర్శనం' అని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. చారిత్రక మైలురాయికి చేరుకున్న ప్రధాని మోదీకి అభినందనలు. భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని పెంపొందించడంలో ఆయన ఎంతో కృషి చేశారు. భారత్‌తో ఉన్న



సన్నిహిత, సుదీర్ఘ స్నేహాన్ని మలేషియా గౌరవిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మన ప్రజలకు అవకాశాలను విస్తరించడంలో సహకారాన్ని కొనసాగించేం దుకు నేను ఎదురుచూస్తున్నా. మోదీ ఇలాంటి మరెన్నో ఘనతలు సాధించాలని.. భారత ప్రజలు శాంతి, శ్రేయస్సులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా అంటూ మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం అభినందనలు తెలిపారు.
మోదీకి ఎన్డీయే నేతల పెద్దఎత్తున అభినందలు తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడం, సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును మోదీ సొంత చేసుకున్న నేపథ్యంలో ఎన్డీయే నేతల సమావేశం బుధవారంనాడిక్కడ భారత్ మండపంలో జరిగింది. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1964 మే 27న తుదిశ్వాస విడిచేంత వరకూ 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు. 2014 మే 26న ప్రధాని పగ్గాలు చేపట్టిన ఆయన బుధవారంతో ఆ పదవిలో నిరాటంకంగా 4,399 రోజులు పూర్తిచేసుకున్నారు. తద్వారా దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకునున్నారు.

## మీనాక్షి స్థానంలో మహేశ్ కేవత్

### అనూహ్యంగా బిజెపికి కలిసి వచ్చిన అవకాశం
### మీనాక్షిపై కేసు తెలంగాణ నేతలే ఉప్పందించారు
### బిజెపి మంత్రి కైలాష్ విజయ్ సంచలన వ్యాఖ్యలు

భోపాల్,జూన్10(ప్రజాజ్యోతి): మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో.. బీజేపీ విజయానికి మార్గం సుగమమైంది. ఆ రాష్ట్రంలో మూడో అభ్యర్థిగా మహేశ్ కేవత్‌కు అవకాశం కల్పించిన బీజేపీ.. ఏకగ్రీవంగా విజయం సాధించి మూడు రాజ్యసభ స్థానాల్లోనూ క్లీన్ స్వీప్ చేయడం దాదాపు ఖాయమైంది. మరో ఇద్దరు అభ్యర్థులైన తరుణ్ చుగ్, రజనీశ్ అగర్వాల్‌ల ఎన్నికను ఖరారు చేసేందుకు ఆ పార్టీకి శాసనసభలో తగినంత మద్దతు ఉంది. దీంతో రాష్ట్ర రాజ్యసభ ఎన్నికల్లో అధికార పార్టీ సంపూర్ణ విజయాన్ని కైవసం చేసుకోనుంది.ఈ నేపథ్యంలో మహేశ్ కేవత్ రాజకీయ నేపథ్యం ఏమిటో ఓసారి పరిశీలిస్తే.. ఆయనో సీనియర్ బీజేపీ నేత. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో పాటు బీజేపీ సంస్థాగత నెట్‌వర్క్‌తో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం కలిగి ఉన్న కేవత్.. అఖిల్ భారతీయ విద్యార్థి పరిషత్ , బీజేపీ యువజన విభాగంలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లా మంత్రిగానే కాకుండా సంఘ్ పరివార్‌లోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. అంతేకాకుండా.. రాష్ట్ర మత్స్యకారుల సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గానూ సేవలందించారు. ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్, కేవత్ సామాజిక నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ.. హిందూ పురాణాలలో పూజ్య పురుషుడైన నిషాద్ రాజ్ వారసత్వ కొనసాగింపునకు ఆయన నామినేషన్ నిదర్శనమని పేర్కొన్నారు. నటరాజన్ నామినేషన్ పత్రాలలో అనేక లోపాలున్నాయని, కొన్ని వివరాలను ఆమె దాచిపెట్టారని బీజేపీ ఆరోపించింది. తెలంగాణలోని ఓ కోర్టులో ఆమెపై ఉన్న పెండింగ్ కేసు విషయాన్ని వెల్లడించలేదనేది ఆ పార్టీ లేవనెత్తిన కీలక అభ్యంతరాలలో ఒకటి. పరిశీలన ప్రక్రియలో ఎన్నికల అధికారులు అభ్యంతరాలను స్వీకరించడంతో ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యసభ పోటీలో కాంగ్రెస్ సవాలుకు దాదాపుగా తెరపడినట్టు సమాచారం. అయితే కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు కైలాష్ విజయ్ వర్గియా సంచలన వ్యాఖ్యలు చేశారు. మీనాక్షీనటరాజన్ మీద తెలంగాణలో కేసుల గురించి టీ కాంగ్రెస్ నేతలే తమకు సమాచారం ఇచ్చారని బాంబు పేల్చారు. ఆయన మీడియా



ప్రతినిధులతో మాట్లాడుతూ.. 'అసలు మీనాక్షీనటరాజన్ మీద తెలంగాణలో కేసు నమోదైనట్టు మాకు తెలియనే తెలియదు. తెలంగాణ కాంగ్రెస్ నుంచే ఆ సమాచారం మాకు వచ్చింది. అక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలే మాకు ఈ సమాచారం ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. అక్కడి నుంచే మాకు ఈ కేసు పత్రాలొచ్చాయి. దీనిని బట్టి కాంగ్రెస్‌లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి' అని వ్యాఖ్యానించారు. మొత్తంగా కైలాష్ విజయ్ వర్గియా వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో పెను ప్రకంపనలకు దారితీశాయి. మీనాక్షికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా, బీజేపీకి అనుకూలంగా కొందరు టీ కాంగ్రెస్ నేతలు కోవర్ట్ రాజకీయాలు నడుపుతున్నారని ఇప్పటికే కొన్ని వార్తలొచ్చాయి. కైలాష్ వర్గియా వ్యాఖ్యలు ఇందుకు మరింత బలాన్ని చేకూర్చాయని పలువురు కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

## పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక

హైదరాబాద్,జూన్ 10 (ప్రజాజ్యోతి): పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు.
చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల



బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు.

## మెట్రో స్టేషన్ల కింద లీజుకు ఎలా ఇస్తారు?

మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యలు చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరాలు సమర్పించారు. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల విషయంలో ఇప్పటికే జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ, మెట్రోస్టేషన్ల కింద ఉన్న వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో హైకోర్టు ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పాదచారుల కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ అంశంపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హెచ్ఆర్ఎంఎల్‌లకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన స్టాళ్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## 25 నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ పక్రియలో ఐటి అంశం అత్యంత కీలకమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ పక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని, అంతేకాకుండా ఓటరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉంటుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి లనీబిIస.Iఇ‌తి.ఱనీల.తిని వెబ్ సైట్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ పక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్ లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఒ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ పక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు.

## దర్శక దిగ్గజం భారతీరాజా కన్నుమూత

మొదటిపేజీ తరువాయి..

'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది.



1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతి÷-లలై, ముదల్ మరియాద్రై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

**NOTICE**

**IN THE COURT OF HON'BLE SHRI. A. M. HUSSAIN, CIVIL JUDGE, S.D., Junnar**

**Marriage Petition NO. 555/2025**
**EXH. - 14**

**Rajendra Shantaram Phulwade .... Applicant**
**V/s**
**Pooja Rajendra Phulwade .... Opponant**

To,
Pooja Rajendra Phulwade
C/o Kisanrao Shamrao Kandhare
A/P. H. No. 1-1-536, Hanuman Nagar,
Nizambad, Telangana -503002.
Mob. No 9505076700.

Whereas the above named applicant had made application to this court, (As per copy enclosed.

You are hereby warned to appear in this court in person or by pleader duly instructed on the date 23/06/2026 at 11-00 am. In the after noon to show cause against the application, failing wherein, the said application will be heard and determined ex party.

Also, take notice that in default of you filing an address for service on or before the date mentioned you are liable to have your defense struck out.

Given under my hand and seal of this court on 28/04/2026

**By Order**
**Sd/-**
**Seal**
**Add. Superintendent,**
**Civil Court, S. D. Junnar.**

## మహబూబ్‌నగర్ జిల్లాకు నూతన డీఎంహెచ్‌వోగా డా. ఆలే శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

మహబూబ్‌నగర్, జూన్ 10 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు, తెలంగాణ, హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా నూతన జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారిగా డా. ఆలే శ్రీనివాసులు నియమితుల య్యారు. ఇంతకుముందు ఆయన నారాయణపేట జిల్లా ప్రభుత్వ జనరల్



ఆసుపత్రిలో సీఎస్ ఆర్ఎంఓగా విధులు నిర్వహించారు. ఈ మేరకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని జిల్లా వైద్య & ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాసులను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డా. శశికాంత్ డిప్యూటీ డీఎంహెచ్‌వో, డా. శైలజ పీవో సీహెచ్ఐ, డా. రాజు డీఎల్‌వో, డా. శివకాంత్, డా. పులి విద్య ఏఓ, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డా. ఆలే శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పీహెచ్‌సీలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్య స్థాయిని మరింత మెరుగుపరుస్తూ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## రక్తదానంలో సేవాభావానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు

- వనపర్తికి గర్వకారణం.. ఎమ్మెల్యే మేఘారెడ్డికి అత్యున్నత సత్కారం

- గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం

వనపర్తి, జూన్ 10 (ప్రజాజ్యోతి): వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి అత్యున్నత రక్తదాత ప్రోత్సాహక పురస్కారం లభించింది. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, యువతను రక్తదానం వైపు ప్రోత్సహించడంలో చేసిన విశేష



కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో అత్యధిక యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న అనేక మంది రోగులకు అవసరమైన రక్తం అందుబాటులోకి వచ్చింది. రక్తదాన ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి నాయకత్వం, యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు చేసిన కృషి విశేష ప్రశంసలు అందుకుంది. ఈ నేపథ్యంలో గవర్నర్ చేతుల మీదుగా అత్యున్నత రక్తదాత ప్రోత్సాహక పురస్కారాన్ని అందుకోవాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. ఈ గుర్తింపు వనపర్తి జిల్లాకు గర్వకారణమని స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా రక్తదాన ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలకు కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన యువతకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామికం

వనపర్తి, జూన్ 10 (ప్రజాజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం పూర్తిగా అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మీనాక్షి నటరాజన్‌కు ఎటువంటి నోటీసు ఇవ్వకుండా, ఆమెపై ఉన్నట్లు చెబుతున్న కేసు గురించి ముందస్తు సమాచారం లేకుండానే నామినేషన్‌ను తిరస్కరించడం అన్యాయమ



న్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో కేసు వివరాలు పేర్కొనలేదనే కారణంతో నామినేషన్‌ను తిరస్క రించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. గాంధేయవాదిగా, ప్రజాస్వామ్య విలువలను విశ్వసించే నాయకురాలైన మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని, అయితే ప్రజా సమస్యలపై గళమెత్తగల నాయకురాలిని ఉన్నత సభకు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిగా పనిచేసిన సమయంలో సాధారణ కార్యకర్తలకు సైతం అందుబాటులో ఉంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకురాలిగా ఆమె నిలిచారని పేర్కొన్నారు. మహిళల సాధికారత గురించి గొప్పలు చెప్పుకునే బీజేపీ ప్రభుత్వం, ఒక మహిళా నాయకురాలి నామినేషన్‌ను తిరస్కరించడం ద్వారా తన ద్వంద్వ వైఖరిని బయటపెట్టిందని విమర్శించారు. "బేటీ బచావో – బేటీ పడావో" అంటూ ప్రచారం చేసే బీజేపీ, మహిళలకు అవకాశాలు కల్పించడంలో మాత్రం విఫలమైందని అన్నారు. వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రతి ఎన్నికలోనూ నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే స్వీకరిస్తారని, కానీ ఈ విషయంలో ఎన్నికల అధికారి కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు లోనై నిర్ణయం తీసుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని రాజేంద్రప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, వెంటనే మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను పునఃపరిశీలించి ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనను ప్రజలు గమనించి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# హెల్మెట్ - సీటుబెల్ట్ మీ కుటుంబానికి రక్షాకవచం

- డీజీపీ స్వాతి లక్రా పిలుపుతో మహబూబ్‌నగర్‌లో ఘనంగా "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం

మహబూబ్‌నగర్, జూన్ 10 ( ప్రజా జ్యోతి బ్యూరో ) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా





పోలీసుల ఆధ్వర్యంలో బాలానగర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల మరియు కళాశాలలో బుధవారం "అరివ్ అలైవ్ " రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ ఆర్గనైజేషన్ & హోంగార్డ్స్ తెలంగాణ స్వాతి లక్రా మాట్లాడుతూ "మీ కోసం ఒక కుటుంబం ఇంట్లో ఎదురుచూస్తోంది... ఆ విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలి" అని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో సంభవించే మరణాలు, తీవ్ర గాయాల్లో దాదాపు 90 శాతం వరకు హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంతో తగ్గించవచ్చని తెలిపారు. కుటుంబ పెద్ద ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులను వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. అంతకుముందు జిల్లా ఎస్పీ దరావత్ జానకి సభను ఉద్దేశించి ప్రారంభ ప్రసంగం చేశారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రమాదం జరిగిన తొలి గంటలో వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు అధికంగా ఉంటాయని డీజీపీ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి అంశాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలని వివరించారు. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, భారీ వాహనాల డ్రైవర్లు, విద్యార్థులకు ప్రత్యేకంగా రోడ్డు భద్రతా సూచనలు అందించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, డ్రైవర్లు, ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, మైనర్లకు వాహనాలు ఇవ్వకపోవడం, అతివేగాన్ని నివారించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని డీజీపీ స్వాతి లక్రా పిలుపునిచ్చారు. గుడ్ సమారిటన్ నిబంధనల ప్రకారం సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించేందుకు మానవత్వంతో స్పందించాలని సూచించారు. అనంతరం డీజీపీ స్వాతి లక్రా చేతుల మీదుగా ప్రజలకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ వాణి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నేషనల్ హైవే అథారిటీ ఇంజనీర్ భాను మిశ్రా, జడ్చర్ల రూరల్ సీఐ మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ సౌమ్య, వైద్య అధికారి డాక్టర్ నేహా, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, బాలానగర్ ఎస్ఐ నరేందర్, ఇతర పోలీసు అధికారులు, ఐటీ సెల్ సిబ్బంది, ఆటో, క్యాబ్, భారీ వాహనాల డ్రైవర్లు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వార్డును శుభ్రపరచుకుందాం.. మనం ఆరోగ్యంగా ఉందాం

-ఇంటి పరిసరాలను శుభ్రపరచుకున్నప్పుడే వార్డు శుభ్రపడుతుంది: మున్సిపల్ చైర్మన్ మానస

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూన్ 10 (ప్రజా జ్యోతి): రోగాల బారిన పడకుండా మన ఇంటి పరిసరాలను శుభ్రపరచుకున్నప్పుడే వార్డు కూడా శుభ్రంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు కూడా



రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించాలని మక్తల్ మున్సిపాలిటీ చైర్మన్ మానస హనుమంతు అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని తొమ్మిదవ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చినటువంటి ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించినటువంటి 9వ వార్డు సభ కార్యక్రమంలో మక్తల్ మున్సిపాలిటీ చైర్మన్ వాకిటి మానస పాల్గొని వార్డు పరిశుభ్రతపై, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస మాట్లాడుతూ రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వార్డు ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడపడితే అక్కడ చెత్తను నిల్వంచ రాదని, ఏరోజటి చెత్తను ఆ రోజే మీ వార్డులోకి వచ్చే మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనంలో చెత్తను వేయాలని, వార్డుని శుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు వ్యాప్తి చెందావని ఆమె ప్రజలకు సూచించారు. ఇంటి పరిసరాలతో పాటు వార్డును శుభ్రం చేసుకుని రోగాల బారిన పడకుండా వార్డు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. త్రాగినీరుని వృధా చేయొద్దని తెలియజేస్తూ డ్రైనేజీలలో చెత్త వేయరాదని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలో ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటాలని అందుబాటులో ఉన్న ప్రదేశాలలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు కాలనీలో ఉన్న పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. వార్డులో ఉన్న చిన్న చిన్న సమస్యలపై చర్చించుకునేందుకు ఈ యొక్క కార్యక్రమం నిర్వహించడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలలో అన్ని వేళల్లో మున్సిపల్ పరంగా ఎలాంటి పని ఉన్న తమను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ శంకరప్ప, మున్సిపల్ సిబ్బంది చెన్నకేశవులు,మేనేజర్ షరీఫ్,మారెప్ప,ఇందిరా కాంగ్రెస్ నాయకులు అమరేందర్ రెడ్డి,తిప్పన్న,అంజప్ప మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణన దేశాభివృద్ధికి కీలకం:అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల జూన్ 10(ప్రజా జ్యోతి ప్రతినిధి): జనాభా గణన దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని,అందులో భాగంగానే ప్రస్తుతం ఇంటింటి గణన(హౌస్ లిస్టింగ్) కార్యక్రమాన్ని





ప్రభుత్వం చేపట్టిందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం మల్దకల్ మండలం నేతివానిపల్లె గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌లో భాగంగా వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరు చేసి నిర్వహించే విధానాన్ని గ్రామస్తులకు వివరించారు.అలాగే వ్యవసాయ,ఉద్యానవన శాఖల ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ,అభివృద్ధి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు.వర్షాకాలంలో తాగునీటి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి లేని వారికి పని దినాలు కల్పించి కూలి చెల్లింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల గురించి కూడా గ్రామస్తులకు వివరించారు.గ్రామస్తులు గ్రామసభలో ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామసభ ప్రత్యేక అధికారి,ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి,సర్పంచ్ పద్మ, ఉపసర్పంచ్ మునినాయక్,పంచాయతీ కార్యదర్శి నరేష్,వార్డు సభ్యులు,వివిధ శాఖల అధికారులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత:డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్

గద్వాల జూన్ 10(ప్రజా జ్యోతి): రాంగ్ డ్రైవింగ్,ప్రమాదకర ఓవర్‌టేకింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలకు అడ్డుకట్ట వేయాలని,రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 47 గ్రామసభలు నిర్వహించగా,ఎర్రవల్లి గ్రామసభలో ఏర్పాటు చేసిన"అరైవ్ అలైవ్"రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్,జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ,ప్రస్తుతం హత్యల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు.డ్రంక్ అండ్ డ్రైవ్,రాంగ్ డ్రైవింగ్,నిర్లక్ష్యపు ఓవర్‌టేకింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ,రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు జీవితాంతం బాధను అనుభవించాల్సి వస్తుందని అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకూడదని,ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.10వ,బెటాలియన్ కమాండెంట్ జయరాములు మాట్లాడుతూ,జీవితంలో కోల్పోయిన అనేక విషయాలను తిరిగి సంపాదించుకోవచ్చని,కానీ ప్రాణం ఒక్కసారి కోల్పోతే తిరిగి తీసుకురాలేమని పేర్కొన్నారు.అందువల్ల ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని



కోరారు.జిల్లా రవాణా శాఖ అధికారి రాధిక మాట్లాడుతూ,ప్రతి ప్రయాణం వెనుక మన కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు ఉంటారనే విషయాన్ని గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు.కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన అవగాహన వీడియోలను ప్రదర్శించారు.అలాగే రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు తమ అనుభవాలను పంచుకోవడంతో సభికులు భావోద్వేగానికి గురయ్యారు.హెల్మెట్ ధరించకపోవడం,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన స్కిట్‌ను కూడా ప్రదర్శించారు.అనంతరం డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

– బాధితురాలికి న్యాయం

మహబూబ్‌నగర్, జూన్ 10 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మహబూబ్‌నగర్‌లోని పోక్సో మరియు అత్యాచార కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. క్రైమ్ నెం. 509/2023కు సంబంధించి బాలికపై లైంగిక దాడికి పాల్పడిన




గుర్రాల బాలయ్య @ బాలి పై విచారణ పూర్తి కాగా, ప్రత్యేక న్యాయస్థానం గౌరవ న్యాయమూర్తి తమన్ రాజరాజేశ్వరి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం చేకూర్చేందుకు దర్యాప్తు అధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పటిష్ఠంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంతో నిందితుడికి శిక్ష పడేలా చేశారు. కేసు దర్యాప్తు నిర్వహించిన సి.ఐ. గాంధీ నాయక్, ఎ. వెంకటేశ్వర్లు, ఎస్ఐ, జి. విజయ్ కుమార్, ఎస్ఐ, ప్రస్తుతం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. విజయ్ కుమార్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. జాన్, కోర్టు లైజన్ అధికారులు బాలకృష్ణ (ఏఎస్ఐ), కృష్ణయ్య (పీసీ), శంకర్ (పీసీ), రహీమ్ (పీసీ), అలాగే సీడీఓ అశోక్ రెడ్డి (పీసీ) సమన్వయంతో పనిచేసి కేసు కన్విక్షన్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ దరావత్ జానకి కేసు దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు సమర్థవంతంగా పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, లైజన్ అధికారులను అభినందించారు.

బాలలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు.

## ఎస్సీ కాలనీలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

-70 ఇండ్లకు మెరుగైన విద్యుత్ సౌకర్యం

అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) జూన్ 10: గోపాల్ దీన్నే గ్రామం ఇటిక్యాల మండలం జోగులాంబ గద్వాల జిల్లాఎస్సీ కాలనీలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమం అనంతరం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు



ప్రారంభించారు.ఎస్సీ కాలనీలోని సుమారు 70 ఇండ్లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు సింగిల్ ఫేజ్ లైన్‌పై 25 కేవీఏ సామర్థ్యం గల నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.గతంలో తక్కువ వోల్టేజ్,తరచూ విద్యుత్‌అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీ వాసులకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా ఉపశమనం లభించనుంది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,గ్రామ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల విద్యుత్ సరఫరా మరింతమెరుగుపడటంతో పాటు గృహ వినియోగదారుల సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు.నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై ఎస్సీ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖ అధికారులకు,ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ సర్వరెడ్డి,ఎంపీ.ఓ.సునీల్,అగ్రికల్చర్ ఏఈఓ జెనిఫర్,ఉప సర్పంచ్ మరియమ్మ,అనంత రెడ్డి,బుజ్జి రెడ్డి,రామకృష్ణ రెడ్డి,కోటేశ్వార్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి,రంగస్వామి,యుగంధర్ గ్రామ పెద్దలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం..





**పరకాల, జూన్ 10 (ప్రజా జ్యోతి) :** పరకాల మున్సిపాలిటీ 16వ వార్డులో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బండి శ్రీధర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ కుమార్ హాజరై మాట్లాడారు.. ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించడం, వార్డు అభివృద్ధికి సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను రూపొందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వార్డులోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెంపు, ప్రజలకు మెరుగైన సేవల అందజేతపై కూడా చర్చించారు. కార్యక్రమంలో 16వ వార్డు అధ్యక్షుడు బండి రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఐలపల్లి స్వామి, గోవింద, ఉపేందర్, శ్రీపతి రాజు, గోవింద ప్రకాష్, వార్డు సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రాయపర్తిలో 99 రోజుల ప్రజా పాలన బిప్రగతి ప్రణాళికపై ప్రత్యేక గ్రామ సభ

**– ప్రభుత్వ పథకాలు గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణపై అవగాహన**





**రాయపర్తి జూన్10 ప్రజా జ్యోతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా రాయపర్తి గ్రామ పంచాయతీ పరిధి లోని బాలికల ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం గ్రామ సర్పంచ్ గారే మహేంద్ర బిక్షపతి అధ్యక్షతన ఘనంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా వరంగల్ రెవిన్యూ డివిజనల్ అధికారి సుమ, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ , మండల విద్యాధికారి శ్రీనివాస్, స్థానిక జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జయకుమారి, స్థానిక వ్యవసాయ అధికారి హాజరై, ప్రభుత్వ పథకాలు మరియు గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై, తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త ,ప్రత్యేకమైన హానికర చెత్తపై అవగాహన మరియు వేరు చేయు విధానంపై ప్రజలకు వివరించారు.వివిధ శాఖల సమన్వయం – అధికారుల ప్రసంగాలు చేశారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకోవడానికి మరియు వివిధ అభివృద్ధి పనులపై అవగాహన కల్పించడానికి పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సభలో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ:లి రైతులకు అందుతున్న పథకాలు, సాగు పద్ధతులపై చర్చించారు. గ్రామపంచాయతీ– పంచాయతీ కార్యదర్శి గుగులోత్ యాకుబ్ నాయక్ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, వర్షాకాల సన్నద్ధత సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా గ్రామపంచాయతీ తీసుకునే చర్యలను వివరించడం జరిగింది .మరియు తాజా పరిస్థితిని సమీక్షించారు. జయశంకర్ బడిబాట కార్యక్రమ మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపపాల్ జయకుమారి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి,ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మరియు విద్యా విధానాలను గ్రామంలోని ప్రజలకు వివరించడం జరిగింది. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, జిపిఓ,మహిళా సంఘాల నేతలు వివోఅధ్యక్షులు, సి ఏ లు అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, అలాగే గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు తమ వార్డులలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

## కేజీబీవీ పాఠశాలలో అదనపు వసతుల పనులకు శంకుస్థాపన

**– ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**



**పాలకుర్తి జూన్ 10/ ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యా లయ పాఠశాలలో అదనపు వసతుల నిర్మాణ పనులకు విద్యార్థినుల విద్యాభివృద్ధికి మెరుగైన సౌకర్యాల కల్పన లక్ష్యంగా చేపట్టిన ఈ పనులను బుధవారం అధికారులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల లో అదనపు వసతుల కోసం రూ.38.10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించి నట్లు తెలిపారు. విద్యార్థి నులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేం దుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతీసుకుంటోందన్నారు..పాఠశాలలో అవసరమై న మౌలిక సదుపాయా లు, తరగతి గదులు, వసతి సౌకర్యాలు అభివృద్ధి పనులను నాణ్య తతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినులు మంచి విద్యను అభ్య సించి ఉన్నత స్థాయికి ఎదగాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపడాలని తెలి పారు.ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, విద్యార్థుల భవిష్యత్తు కోసం అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందించేందు కు కృషి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, జలగం కుమార్, మాజీ సర్పంచ్ యాకాంతరావు, ఎండి మదర్, శ్రీనివాస్, చిలువేరు కృష్ణమూర్తి, పెనుగొండ రమేష్, కమ్మగాని నాగయ్య, పన్నీరు వెంకన్న, ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో వాకర్స్ కీలక పాత్ర..





**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..**

**హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 10 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో ఇటీవల నిర్వహించిన వాకర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డీ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులుగా దొంతి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగవెల్లి యుగేందర్, కార్యదర్శిగా బిరుదురాజు రఘురామరాజు, సంయుక్త కార్యదర్శిగా తాళ్లపెల్లి రవీందర్, కోశాధికారిగా సలీం, కార్యవర్గ సభ్యులుగా సంకేపల్లి దివాకర్ రెడ్డి, ఆడెపు భాస్కర్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో వాకర్స్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రతిరోజూ నడక అలవాటును ప్రోత్సహించడం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి పనిచేస్తూ ఆదర్శంగా నిలవాలని నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని, సభ్యుల సంక్షేమంతో పాటు సామాజిక బాధ్యతలను కూడా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్లు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# 19వ వార్డులో ఘనంగా వార్డు సభ..





**– సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం..**
**– ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల వద్దకే పాలన..**
**– మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్..**

**పరకాల జూన్ 10 (ప్రజాజ్యోతి) :** పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వార్డు సభను నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కొయ్యడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వార్డులో నెలకొన్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ,, ప్రజల నుంచి స్వీకరించిన వినతులు, ఫిర్యాదులను క్రోడీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వార్డులో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ కుమార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలన ప్రజల వద్దకే చేరి, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న వార్డు సభలు విశేష స్పందన పొందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు చేపట్టని విధంగా ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరకాల పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అనేక సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారని చెప్పారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధికి భారీ నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి సందీప్ రెడ్డి, వార్డు అధికారి బుచ్చిరాజు, ఎండి రంజాన్ అలీ, ఎండి షఫీ, దుప్పటి రాజేష్, జేరిపోతుల గోపి, పూసల సదానందం, లక్కం భిక్షపతి, ఉంటేరు సురేష్, జావిద్, నజీర్, కొయ్యడ కుమార్, ఏకు సురేష్, వక్కిలి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి పథకం దేశానికే ఆదర్శం-మంత్రి పొన్నం ప్రభాకర్





**హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 10 (ప్రజాజ్యోతి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులతో రూ.199.08 కోట్ల పెట్టుబడి పెట్టి 553 టీజీఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనమని అన్నారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందని వివరించారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని, సుమారు రూ.10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 86 బస్సులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో వరంగల్ జిల్లాకు 11, హనుమకొండ జిల్లాకు 12, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 11, జనగాం జిల్లాకు 12, ములుగు జిల్లాకు 9, మహబూబాబాద్ జిల్లాకు 16 బస్సులు కేటాయించినట్లు తెలిపారు. మహిళలను లబ్ధిదారుల స్థాయి నుంచి యజమానులు, భాగస్వాములుగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని, మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య, సుశిక్షితులైన ఉపాధ్యాయులు





**– మండల కేంద్రంలో బడిబాట ర్యాలీ**
**– జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారే కృష్ణమూర్తి**
**– ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి**

**రాయపర్తి జూన్ 10 ప్రజా జ్యోతి :** బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలం లోని రాయపర్తి గ్రామంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల రాయపర్తి, ప్రాథమిక పాఠశాల రాయపర్తి, ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం రాయపర్తి వారి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం రాయపర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణము నుండి రాయపర్తి గ్రామంలోని ముస్లిం బజార్, మాల కాలనీ మరియు రాయపర్తి కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం వరకు బడిబాట కార్యక్రమాన్ని ర్యాలీ రూపంగ నిర్వహించడం జరిగింది.అదేవిధంగా గ్రామంలోని బడి ఈడు పిల్లలు మరియు జూనియర్,కళాశాలలో కొత్తగా చేరుతున్నటువంటి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నటువంటి,సదుపాయాలను మధ్యాహ్న భోజనము, అల్పాహారము, ఉచిత పాఠ్యపుస్తకములు, రవాణా చార్జీలు, స్కాలర్షిప్స్, నాణ్యమైన విద్యను అందించేటి క్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వము ప్రభుత్వ జూనియర్ కళాశాల రాయపర్తి నందు అనేకమైనటువంటి సదుపాయాలు కల్పిస్తుంది, నాణ్యమైన విద్యను అందిస్తుంది. ఐఎఫ్పి ప్యానెల్ ద్వారా విద్యా ప్రమాణాలు పెంచుతున్నారు. అనుభవజ్ఞులైనటువంటి లెక్చరర్లచే పాఠ్యాంశ బోధన చేయడం జరుగుతుంది అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు సెక్రటరీ గారే కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల పురాతన సరస్వతీ నిలయమైన మన పాఠశాలలో అనేకమైనటువంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుంది. విద్యార్థులకు అందుబాటులో ఉండేటువంటి ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలు బోధిస్తున్నందున విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి అనేకమైన సౌకర్యాలు ఉదయం వేళ అల్పాహారము, సన్నబియ్యంతో మధ్యాహ్నం భోజనము వారానికి మూడు రోజులు ఉడికించిన కోడిగుడ్లు వారానికి మూడు రోజులు రాగి జావా ఉచిత పాఠ్య పుస్తకాలు ఉచిత నోట్ పుస్తకాలు ఐఎఫ్పి ప్యానల్ ద్వారా విద్యాబోధన గ్రంథాలయ సదుపాయము ఉదయం వేళ అల్పాహారం సైన్స్ పరికరాలు విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి కలిగించే విధంగా క్రీడా సామాగ్రి సకల వసులతో వసతులతో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ సెక్రటరీ పాఠశాల రాయపర్తి నందు అనుభవం అర్హత కలిగినటువంటి ఉపాధ్యాయుల చేత ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్ని తరగతులకు బోధించే విధంగా అందరూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండడం విద్యార్థులకు విద్యాప్రమాణాలు మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందని తల్లిదండ్రులకు సూచించారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను పంపించి మానసిక ఒత్తిడి, పిల్లలకు అలసట కలిగించే విధంగా, ఆర్థికపరమైనటువంటి భారాన్ని భరించడం కంటే అన్ని సదుపాయాలు కలిగినటువంటి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ విద్యాసంస్థల అయినటువంటి ప్రాథమిక పాఠశాల రాయపర్తి, ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం రాయపర్తి, జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల రాయపర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల రాయపర్తి నందు అందరూ తల్లిదండ్రులు చేర్పించాలని వారు కోరారు. ఇట్టి సమావేశంలో జూనియర్ లెక్చరర్ అయినటువంటి బైరి సుధాకర్, లైబ్రేరియన్ సునీల్ రెడ్డి,ఎన్ సోమయ్య కె.నవీన్ కుమార్ పి.రాజిరెడ్డి, డి.శ్రీనివాస్ ఏ నాగరాజు, ఏ బాలకృష్ణ ఏం రాజు ఏ రాజేందర్ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు, ఎస్వి.బి శర్మ బి.ఉపేందర్, జి ప్రవీణ్ రెడ్డి సురేందర్ రోజా రాణి రాధా కె శ్రీనివాస్ సంధ్య, సిఆర్పి సంధ్య మరియు నాన్ టీచింగ్ సిబ్బంది మరియు ఇతరులు ప్రాథమిక పాఠశాల నుండి సతీష్ స్వాతి మురళి మొదలగు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

## మోదీ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి..

**బీజేపీ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు..**



**పరకాల, జూన్ 10 (ప్రజాజ్యోతి) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర, జిల్లా శాఖల పిలుపు మేరకు బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి టెంపుల్స్ ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ డా. పెసరు విజయచంద్ర రెడ్డి హాజరై మాట్లాడుతూ,, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, అభివృద్ధి సుపరిపాలనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వచ్చి, కేంద్రం–రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడటం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంతీ లాల్, పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, బెజ్జంకి పూర్ణాచారి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, నాయకులు కాచం గురు ప్రసాద్, ఎర్ర రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, జిల్లా నాయకులు మార్త రాజభద్రయ్య, కొలనుపాక భద్రయ్య, మెంతుల సురేష్, బాసాని సోమరాజు, సూర్యదేవర సదానందం, కానుగుల గోపీనాథ్, వెలిశెట్టి శారద, సారంగ నరేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోడీ పేరు మీద అర్చన





**రఘునాథపల్లి, జూన్ 10 (ప్రజాజ్యోతి) :** భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ ఆధ్వర్యంలో రఘునాథపల్లి శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో ప్రధానమంత్రి మోడీ పేరు మీద అర్చన చేయించడం జరిగినది ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఉడుగుల రమేష్, సుభాష్, జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ తోకల ఉమారాణి, పట్లపల్లి సత్యం, పెద్దోజు జగదీష్, అలాగే జిల్లా ఉపాధ్యక్షులు కావటి ముత్యాలు, సీనియర్ నాయకులు కలుపగురి ప్రభాకర్, రఘునాథపల్లి మండల ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సోమేశ్వర్ బిజెపి నాయకులు శ్రీ మహాదేవ స్వామి ఆలయ చైర్మన్ కోరెళ్ళ ఉపేందర్, ఓరుగంటి శంకర్ లింగం, బచ్చు చిరంజీవి, కోరెల్లా చిన్న ఉపేందర్, పజూరి రాజు, కూరెళ్ళ వేద కుమార్ మరియు మహిళా సోదర మణులు పాల్గొనడం జరిగినది.




## ఎస్సీ ఉప కులాలు ఉన్నత చదువులు చదవాలి

**వర్గీకరణ ఫలితాలను సద్వినియోగ పరుచుకోవాలి**
**ఎమ్మార్పీఎస్ కాటారం ఇంచార్జ్ బెల్లంపల్లి సురేష్ మాదిగ**

**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 10 (ప్రజాజ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి బెల్లంపల్లి సురేష్ మాదిగ పలు గ్రామాలలో పర్యటిస్తూ ఎస్సి వర్గీకరణ సాధించిన తరుణంలో వర్గీకరణ ఫలితాలను సద్వినియోగ పరుచుకోవాలనీ పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గో. టు. విలేజ్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల్లో ఉన్నా ఎస్సీ ఉప కులాలు వర్గీకరణ ఫలితాల్లో ముందు వరుసలో ఉండాలని ఉన్నత చదువులు చదవాలని పేర్కొన్నారు. అదే క్రమంలో నస్తురుపల్లి, బొప్పారం, ఇబ్రహీంపల్లి, చింతకాని, గ్రామాల్లో పర్యటిస్తూ విద్య ప్రాముఖ్యతను గ్రామాల్లోని తల్లిదండ్రులకు యువతకు విద్యార్థులకు వివరించారు. వర్గీకరణ సాధించిన మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నస్తూరుపల్లి గ్రామ ఉప సర్పంచ్ శంకర్ మరియు దేవేందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



## తాడిచెట్టు ప్రమాదంలో గాయపడిన గీత కార్మికుడికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియ ఇవ్వాలి: బత్తుల జనార్ధన్

తుంగతుర్తి, జూన్ 10,(ప్రజా జ్యోతి):
తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు చీకటి శ్రీనివాస్ తాడిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ



డంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో అతనికి మూడు ఎముకలు విరగడంతో పాటు తలకు గాయమై పది కుట్లు పడ్డాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న శ్రీనివాస్‌ను కల్లు గీత కార్మిక సంఘం (కేజీకేఎస్) సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల జనార్ధన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న ఈ పేద కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌కు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసి కుటుంబానికి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం తుంగతుర్తి మండల అధ్యక్షుడు మద్దెల నరసయ్య, కార్యదర్శి చిర్ర నరేష్, గొట్టిపర్తి సొసైటీ అధ్యక్షుడు బొమ్మగాని వెంకన్న, చీకటి మల్లయ్య, చామకూరి శ్రీను, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగావకాశాలు

భూదాన్ పోచంపల్లి, జూన్ 10 (ప్రజాజ్యోతి):
మండలంలోని దేశముఖి గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక



మహిళ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న స్టాటిస్టిక్స్ మరియు లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా. కె. శ్రీలత తెలిపారు. సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, నెట్ లేదా సెట్ అర్హతలతో పాటు బోధన అనుభవం కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 7306981947, 7995010687 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ డా. కె. శ్రీలత తెలిపారు.

## ఎస్ పి ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలలో స్వచ్ భారత్

నాగార్జునసాగర్,జూన్ 10 ప్రజా జ్యోతి :
నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో బుధవారం నాగార్జునసాగర్ యూనిట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలోస్వచ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు,ఈ సందర్భంగా ఎస్ పిఎఫ్ నాగార్జునసాగర్ యూనిట్





అసిస్టెంట్ కమాండెంట్ బి రాజు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్- 99 కార్యక్రమంలో భాగంగా ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా,జోన్ డిఐజి మాధవరావు ఆదేశాల మేరకు నాగార్జున సాగర్లోని అభిరామేశ్వరరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో చెత్తను,వృధా ప్లాస్టిక్ ను ఏరివేసి స్వచ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా తెలిపారు.ప్రతి ఒక్కరు తమ ఇల్లు, దాని పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా వుండే విధంగా బాధ్యతగా వుండాలని అప్పుడే పర్యావరణ పరిరక్షణతో పాటు,జీవన మనుగడకు దోహదం చేసినవారు అవుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐలు రఘు,వెంకటేశ్వర్లు,ఏ ఎస్ ఐ లు పుల్లయ్య,రవీందర్,యూసుఫ్ లు జెన్కో,సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 12 న తుంగతుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలకు వేలంపాట

తుంగతుర్తి, జూన్ 10, (ప్రజా జ్యోతి):



వివిధ ఎక్సైజ్ కేసులలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు ఈ నెల 12 న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు.బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఈ వేలం పాట తుంగతుర్తి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.హీరో హోండా ప్యాషన్ ప్లస్, హీరో స్ప్లెండర్ ప్లస్, టీవీఎస్ ఎక్సెల్, గ్లామర్, ప్యాషన్ ప్లస్, ఆటో రిక్షా, హీరో గ్లామర్ బైక్, టీవీఎస్ స్పోర్ట్స్ బైక్, సిబి షైన్ డ్రం మొత్తంగా 9 వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే ఆసక్తిదారులు ప్రతి వాహనం యొక్క నిర్ణయించిన ధరలో సగం వాటా ఈఎండి చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.వేలం పాటలో వాహనం లభించని వారి యొక్క డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని తెలిపారు.వేలంపాటలో వాహనాన్ని దక్కించుకున్న వారు వారి డిపాజిట్ మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని చెల్లించి వాహనాన్ని పొందవచ్చు అని తెలిపారు.

## స్వర్ణభారతి ట్రస్ట్ చలివేంద్రం ముగింపు, దాతలకు ఘన సన్మానం

### ఏడేళ్లుగా నిరంతరాయంగా చలివేంద్రం

కోదాడ టౌన్, జూన్ 10 (ప్రజాజ్యోతి):
కోదాడ పట్టణంలో గత 70 రోజులుగా బాటసారుల దాహార్తిని తీర్చిన స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ ఉచిత





మినరల్ వాటర్ చలివేంద్రం బుధవారంతో ముగిసింది. మండు వేసవిలో బాటసారులకు తాగునీరు అందించేందుకు ట్రస్ట్ నిర్వాహకులు గత ఏడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ 4,000 మందికి పైగా ప్రజలు దాహార్తిని తీర్చుకున్నారు. ఈ సేవా కార్యక్రమానికి దాదాపు రూ. 1.5 లక్షల వరకు ఖర్చు కాగా, ఇందుకు ఆర్థికంగా సహకరించిన ప్రముఖ దాతలు చక్కా హరిబాబు, వరగాని రామకృష్ణ, రుద్రయ్య, నాగుబండి రంగాలను ట్రస్ట్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. నిరంతరాయంగా బాటసారులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తూ స్వర్ణభారతి ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని దాతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి యాదా సుధాకర్, స్వర్ణభారతి స్వయం సేవక్ సభ్యులు చీదేళ్ళ హనుమంతరావు, దేవరశెట్టి శంకర్,పల్లవి శ్రీనివాసరావు, మట్టపల్లి శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు, స్వామి శ్రీనివాసరావు,యువజన విభాగం నాయకులు పత్తి నరేందర్,గుడుగుంట్ల సాయి పాల్గొన్నారు.

## జూన్ 15న చలో కలెక్టరేట్ ను విజయవంతం చేయండి

### గ్రామీణ పేదల సంఘం

చివ్వెంల జూన్ 10 (ప్రజాజ్యోతి):
చివ్వెంల మండలం చందుపట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రంలో ఉన్న బి.జె.పి. ప్రభుత్వం ప్రతి సంవత్సరము రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామనే పేరుతో రైతులకు కావల్సిన ఎరువులు,క్రిమి సంహారక మందులు,పెట్రోల్,డిజిల్,గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి రైతులను మోసం చేస్తుంది.దానిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వరి ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నామనే



పేరుతో ఒక కేజి వరి ధాన్యానికి 0.72 పైసలు పెంచి మద్దతు ధర ఇచ్చినట్లు ప్రకటించుకుంటుంది.కాని వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిన దానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 0.72 పైసలు ఏ మూలకు సరిపోవు.కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఎరువుల ధరలను పెంచుతూ ఈ సంవత్సరం 50. కేజిల బస్తాకు 350 నుండి 400 రూ॥లకు పెంచింది.మరోవైపు డిజిల్, పెట్రోల్ గ్యాస్ వ్యవసాయ పనిముట్ల విపరీతంగా పెంచి వరికి మద్దతు ధర పెంచుతున్నామని రైతులకు ఎంతో మేలు చేస్తున్నామని రైతులను మోసం చేస్తూ పారిశ్రామిక వేత్తలకు మాత్రం వేల కోట్లు రుణ మాఫీ చేస్తుంది.రైతులకు మాత్రం ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఒక లక్ష రూ॥లు మాఫి చేయాక రైతులను మొండి చేయి చూపిస్తుంది.మరో ప్రక్క తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రతి ఎకరానికి సంవత్సరానికి 15 వేల రూ॥లు ఇస్తామని హామి ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని 12 వేలకు కుదించింది.మా ప్రభుత్వం ప్రతి ఎకరాకు 12 వేలు ఇస్తున్నాము అని ప్రచారం చేస్తూ గడిచిన (2 1/2) రెండున్నర సంవత్సరాలలో 5 విడతలుగా ఇవ్వవలసిన రైతు బరోసాను రెండుసార్లు కూడా ఇవ్వలేదు.దానిని కూడా గత రబీ పంటకు ఇవ్వవలసిన నిధులను జనవరి నుండి వాయిదాల మీద వాయిదాలు వేస్తూ ఇప్పటి వరకు ఇచ్చింది లేదు.రాష్ట్రంలో రైతు బరోసాను గొప్పగా అమలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుంది.ఎన్నికల సందర్భంగా పాలకవర్గ పార్టీలు అధికారంలోకి వస్తే రైతులను రాజులను చేస్తామని,మాది రైతు ప్రభుత్వమని చెప్పుతూ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను అప్పుల పాలు చేస్తుంది.అదే విధంగా నాణ్యమైన విధ్యుత్ సాగునీరు ఎరువులు,క్రిమి సంహారక మందులు, యూరియా అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిగా విఫలమైంది.మరో వైపు దేశవ్యాప్తంగా రోజు రోజుకు రైతుల ఆత్మహత్యలు విపరితంగా పెరిగి పోతున్నాయి.ఈ విధంగా కొన్ని డిమాండ్లతో కలెక్టర్ కార్యాలయంలో ధర్నా నిర్వహించబడుతుంది దీనికి ప్రజలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య, ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ జిల్లా కార్యదర్శి భాషిపంగు సునీల్,మాజీ ఎంపీటీసీ కోడిబండ్లయ్య,జిల్లా నాయకులు అనంతుల యల్లయ్య ,నల్లగొండ లింగయ్య గోపి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటిన నేరేడుచర్ల పోలీస్

నేరేడుచర్ల జూన్ 10(ప్రజా జ్యోతి ):
నేరేడుచర్ల మండల కేంద్రం లో సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారిని అంతమొందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ ఈగల్ టీం నేతృత్వంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వినూత్న, ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సంకేతంగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో సూర్యాపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటారు. దీనిలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు నేరేడుచర్ల మండలంలో గల ప్రభుత్వ హెల్త్ సెంటర్ నందు స్థానిక ప్రభుత్వ వైద్యులు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పోలీస్ అధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాము అని ఎస్ఐ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువతను, ప్రజలను డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తోంది. మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత కేవలం పోలీస్ శాఖపైనే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉంది. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో విస్తృత అవగాహన కల్పించేందుకే ఈ ప్రత్యేక మొక్కలు



నాటే కార్యక్రమాన్ని చేపట్టాం. మొక్కలు ఎలాగైతే జీవాన్ని ఇస్తాయో, డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడం కూడా అంతే ముఖ్యం అని చాటిచెప్పడమే మా సంకల్పం, మొక్కలు నాటే ఈ వినూత్న కార్యక్రమం ద్వారా డ్రగ్స్ నిర్మూలనకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు, అధికారులు కలిసికట్టుగా పోరాడాలని సూర్యాపేట పోలీస్ పిలుపునిచ్చింది అన్నారు.

## ఘనంగా బీజేపీ నేత గంగిడి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు

మర్రిగూడ, జూన్ 10 (ప్రజాజ్యోతి):



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, మునుగోడు నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ గంగిడి మనోహర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం నాడు అత్యంత ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.హైదరాబాద్ నార్సింగిలోని గంగిడి మనోహర్ రెడ్డి నివాసానికి బీజేపీ రాష్ట్ర ఓబీసీ నాయకులు నారోజు కుమారస్వామి చేరుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మునుగోడు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి గంగిడి మనోహర్ రెడ్డి అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయం అని ఆయన అన్నారు.ఆయన భగవంతుని ఆశీస్సులతో సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన కోరారు. ఈ వేడుకల్లో నారోజు కుమారస్వామితో పాటు మునుగోడు నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ ముఖ్య నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. మనోహర్ రెడ్డి భవిష్యత్తు రాజకీయ ప్రస్థానం మరింత దిగ్విజయంగా సాగాలని వారంతా ఆకాంక్షించారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

### తోకల సైదులు ముదిరాజ్

మునగాల, జూన్ 10 (ప్రజా జ్యోతి):



రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులకు అడ్డుకట్ట వేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సైదులు ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతూ వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య అనేది వ్యాపారం కాదని, ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండే ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫీజు నియంత్రణ కమిటీ సూచనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి ప్రైవేట్ పాఠశాల మరియు కళాశాల తమ ఫీజు వివరాలను పారదర్శకంగా ప్రకటించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యా హక్కును పరిరక్షించేందుకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## నేలమర్రి క్లస్టర్ నూతన ఏఈఓగా గుగులోతు సునీత బాధ్యతల స్వీకరణ

మునగాల, జూన్ 10 (ప్రజా జ్యోతి):
మునగాల మండలంలోని నేలమర్రి క్లస్టర్‌కు నూతన వ్యవసాయ విస్తరణ



అధికారి (ఏఈఓ)గా గుగులోతు సునీత బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నేలమర్రి క్లస్టర్‌లో విధులు నిర్వహించిన ఏఈఓ సీహెచ్ భవాని బదిలీపై జజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం క్లస్టర్‌కు వెళ్లారు. ఆమె స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల క్లస్టర్ నుంచి గుగులోతు సునీతను నియమించారు. ఈ సందర్భంగా తాడ్వాయి, మాధవరం, నేలమర్రి రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ సంబంధిత సలహాలు, సేవల కోసం నూతన ఏఈఓను సంప్రదించాలని అధికారులు సూచించారు. రైతులు 7815961390 మొబైల్ నంబర్ ద్వారా ఏఈఓ గుగులోతు సునీతను సంప్రదించి తమ వ్యవసాయ సమస్యలు, సందేహాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మోత్కూరు, జూన్ 10 (ప్రజా జ్యోతి):
విద్యార్థులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని చదువులో ఉన్నతంగా రాణించి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆకాంక్షించారు. సోమవారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో జిల్లా పరిషత్ మోత్కూర్ ఉన్నత



పాఠశాల పదవ తరగతి పరీక్షల్లో 500 కు పైగా మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులను ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే అత్యుత్తమ బోధన అందుతుందని, దాని ఫలితమే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువా, మెమెంటో, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. త్రిబుల్ ఐటీ బాసరలో ప్రవేశం పొందిన కొక్కుల ఉషశ్రీ కి నగదు పురస్కారం అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, ఇ.రాంప్రసాద్, బి.రామకృష్ణ, ధర్మారపు వెంకటయ్య, జె.ప్రవీణ్ , జె.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా పనిచేసి చూపిస్తా

### ఆలేరు మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్

ఆలేరు జూన్ 10 ప్రజా జ్యోతి
పార్టీలకు అతీతంగా ఆలేరు అభివృద్ధికి సహకరిస్తానని ఆలేరు మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా




ఆలేరు మున్సిపల్ కేంద్రంలో పదో వార్డు పదకొండు వార్డు 12వ వార్డు ఒకటో వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ ముష్కోల మోరి మీదిగా వెళ్లే దారి చెత్తతో నిండి ఉందని జెసిబిల సహాయంతో తొందరలోనే శుభ్రపరుస్తానన్నారు. పలు వార్డులలో ఏమైనా రోడ్ల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. నీటి సమస్య రాకుండా ఉండేందుకు తమ వంతు సహకరిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఆలేరు పట్టణాన్ని సుందరవరంగా తయారు చేస్తానన్నారు. రోడ్ వెంబడి ఎక్కడైనా గుంతలు ఉన్నట్టయితే వాటిని పూడ్చడానికి అధికారులు పాలకవర్గం పనిచేస్తుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ లు మల్లెల సరిత శ్రీకాంత్, జట్ట నీరజ సిదులు, జూకంటి సంపత్, పాకాల మౌనిక హరీష్ మేనేజర్ జగన్మోహన్, మున్సిపల్ సిబ్బంది అనిత రాజు రేణుక తదితరులు పాల్గొన్నారు

# పొంచి ఉన్న పెను ప్రమాదం

● విరిగిన ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్‌తో స్థానికుల్లో భయం ● స్పందించని విద్యుత్ అధికారులు




**నిజామాబాద్/నంది పేట్ (ప్రజాజ్యోతి):** నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్- ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మోస్తున్న ఓ పిల్లర్ విరిగిపోయి, పక్కనే ఉన్న మరో విద్యుత్ స్తంభంపై ఒరిగి ఉ ఒడటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారిపై ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుండగా, ప్రమాదకర స్థితిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు కూలి రహదారిపై వెళ్లే ప్రయాణికులపై పడుతుందోనన్న భయం ప్రజలను వెంటాడుతోంది. సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉ ఒడటంతో ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంటే భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బలమైన గాలులు, వర్షాల ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్ పిల్లర్ పూర్తిగా కూలిపోయే ప్రమాదం మరింత పెరిగిందని వారు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదం సంభవించే ముందు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, దెబ్బతిన్న పిల్లర్‌ను తక్షణమే మార్చాలని లేదా శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందస్తు చర్యలతో ప్రాణాలను కాపాడటం అధికారుల బాధ్యత" అని ఓ వాహన దారుడు పేర్కొన్నాడు.

# కమ్మర్‌పల్లిలో ఘనంగా వనమహోత్సవం



**కమ్మర్‌పల్లి (ప్రజాజ్యోతి) జూన్ 10:** కమ్మర్‌పల్లి గ్రామ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, హరితహారం లక్ష్యంగా జరిగిన ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిత గారు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ గారు ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని, భవిష్యత్ తరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి గ్రామ సర్పంచ్ కొత్తపల్లి హారిక, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మల్యాల శుభాష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి, అటవీ శాఖ సిబ్బంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వరుణ్ మరియు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## యూరియ యాప్‌ను రద్దు చేసి
# రైతులకు యూరియా కొరత తీర్చాలి

● ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన తాజామాజీ జెడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్



**ప్రజాజ్యోతి, ఏర్గట్ల, జూన్10:** రైతులకు అవసరమైన సమయంలో యూరియా ఎరువు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఏర్గట్ల మండల మాజీ జెడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్ పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు యూరియా కోసం ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. యూరియా నిల్వలను తెలుసుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో స్టాక్ ఉన్నట్లు చూపిస్తున్నప్పటికీ, వాస్తవానికి దుకాణాలకు వెళ్లిన రైతులకు యూరియా అందుబాటులో ఉండడం లేదని విమర్శించారు. "షాపులో లేని యూరియా యాప్‌లో ఎలా ఉ ఒటుంది?" అని ఆయన ప్రశ్నించారు. యాప్‌లో చూపించే వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని, దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. యాప్‌పై ఆధారపడకుండా రైతులకు నేరుగా యూరియా సరఫరా చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం హయాంలో యూరియా రైతులందరికీ అందుబాటులో ఉందని ఇంత కావాలంటే అంత కొరత లేకుండా అందించిన విషయం ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం వ్యవసాయ పనులు వేగంగా సాగుతున్న ఈ తరుణంలో యూరియా కొరతను వెంటనే నివారించి, ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని గుల్లే రాజేశ్వర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్ ప్రమాదకరం
# టోల్ ప్లాజా వద్ద అవగాహన కల్పించిన ఎస్సై సుమలత

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్.10** మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద బుధవారం బుధవారం అరవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందాక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుమలత వాహనదారులకు రోడ్ భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ దివ్య చక్రం వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు అలాగే మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని హెచ్చరించారు. డ్రింక్ అండ్ డ్రైవ్ కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ను ఉ ల్లంఘించిన వారిని ఎట్టి పరిస్థితులను క్షమించబోమని ఎస్సై స్పష్టం చేశారు ప్రజల ప్రాణాలు భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొని రోడ్డు భద్రతపై ఆధార పొందారు అధికారులు వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై సూచనలు చేస్తూ భద్రత చర్యలు ప్రాముఖ్యతను వివరించారు.




# ఆర్యవైశ్య సత్రంలో నూతన బోర్ డ్రిల్లింగ్

● సత్రం అధ్యక్షులు గంజి సతీష్ గుప్తా



**రామారెడ్డి జూన్ 10 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండల కేంద్రంలోని శ్రీ కాలభైరవ ఆర్యవైశ్య సత్రంలో త్రాగు నీటి సమస్య ఉన్నందున బుధవారం సత్రం అధ్యక్షులు గంజి సతీష్ గుప్తా ఆధ్వర్యంలో నూతన బోర్ వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప కార్యదర్శి పడిగెల శ్రీనివాస్ గుప్తా, వుడ్ కమిటీ చైర్మన్ తమ్మి శ్రీనివాస్ గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాతసత్యం గుప్తా తదితరులు పాల్గొనడం జరిగింది.

# కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా కోనాపూర్ ఉన్నత పాఠశాల

● మండల పంచాయతీ అధికారి సదాశివ్





**కమ్మర్‌పల్లి ( ప్రజాజ్యోతి ) జూన్ : 10** కమ్మర్ పల్లి మండలం కోనాపూర్ ఉన్నత పాఠశాలలో లక్షల రూపాయల ఫీజులు ఉండే కార్పొరేట్ స్కూల్లో కంటే అధికంగా సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు గ్రామస్తులు తమ విద్యార్థులను కోనాపూర్ పాఠశాలలో చేర్పించాలని కమ్మర్ పల్లి మండల పంచాయతీ అధికారి సదాశివ్ తెలిపారు. బుధవారం ప్రగతి ప్రణాళిక వందరోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ప్రసంగిస్తూ రాష్ట్ర ,జిల్లా, కమ్మర్ పల్లి మండలం అన్నింటికంటే ఉత్తమంగా ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:7 ఉందని , దాంతో ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తారని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు రెమేడియల్ తరగతులు, వైయక్తికబోధన జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ హరిత విద్యాలయ పథకంలో 5 స్టార్ రేటింగ్ కోనాపూర్ పాఠశాలకు అత్యుత్తమ రేటింగ్ వచ్చింది అని తెలిపారు. వివిధ ప్రభుత్వ పథకాలైన కళ్యాణ లక్ష్మి, ఉపాధి హామీ పథకం, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి , గృహజ్యోతి లను ఆదరించినట్లుగానే ప్రభుత్వ పాఠశాలలను కూడా మీ విద్యార్థులను నమోదు చేసి విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చూడాలని తెలిపారు. కోనాపూర్ గ్రామ సర్పంచ్ అరుణ్ రెడ్డి మాట్లాడుతూ తన ఐదు సంవత్సరాల గౌరవ వేతనాన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేటాయిస్తున్నానని తెలిపారు. బడి తోటలో పండించిన కూరగాయలు మధ్యాహ్న భోజన పథకం లో వాడడం వల్ల విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం లభిస్తుందని తెలిపారు. పాఠశాలలకు ఎలాంటి సహాయం అవసరం ఉన్న సత్వరమే స్పందిస్తానని తెలిపారు. కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అర్జున్ ప్రసంగిస్తూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని , రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, పిల్లలు ఆన్లైన్ గేమ్స్ ఆడకుండా తల్లిదండ్రులు నిఘా ఉ ఒచాలని , డ్రగ్స్ గంజాయి మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా , సైబర్ క్రైమ్ , పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఎన్ఎం శోభారాణి పాఠశాల విద్యార్థులందరికి సంవత్సరానికి రెండుసార్లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామని, దృష్టిలోకం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని, విద్యార్థులు జంక్ ఫుడ్ కు దూరంగా ఉ ఒడాలని, ఇంట్లో తయారు చేసిన తిరుబండారాలు మాత్రమే తినాలని ఎక్కువగా ఆకుకూరలు, కాయగూరలు, తృణ ధాన్యాలు తీసుకోవాలని ,14 సంవత్సరాలు దాటిన బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ వినోద్ విద్యార్థులందరికీ ప్రభుత్వ వివిధ పథకాల కోసం ఉచితంగా క్యాస్ట్ ,ఇన్కమ్ సర్టిఫికెట్లు అందజేస్తామని విద్యార్థులు పాఠశాలలో నమోదు కాగానే వీటికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌడారపు రాంప్రసాద్ పాఠశాల ప్రారంభం రోజున వచ్చే విద్యార్థులందరికీ జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు ఇస్తామని, అలాగే బాలురకు బాలికలకు ప్రత్యేకంగా డ్రా ద్వారా 1000 రూపాయలను విలువైన స్కూల్ బ్యాగ్ ను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోర్తాడు ఉదయ్, పంచాయతీ కార్యదర్శి నవీన్, వార్డు సభ్యులు , వివిధ గ్రామ మండల స్థాయి అధికారులు, ఉ పాధ్యాయులు పాల్గొన్నారు

# గ్రామ సభలో హెల్మెట్‌లను అందించిన జిల్లా కలెక్టర్

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అడిషనల్ ఎస్పీ నర్సింహా రెడ్డి





**కామారెడ్డి ప్రతినిధి జూన్ 10. (ప్రజాజ్యోతి)** బిక్నూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం బిక్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు తీరును గ్రామస్థులతో కలిసి సమీక్షించారు. గ్రామ ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో నాలుగు దఫాలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక



గ్రామసభల ద్వారా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న పూరి గుడిసెలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 10 పూరి గుడిసెలను గుర్తించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తూ, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన వారిని ఓటరు జాబితాలో నమోదు చేయడం, డబుల్ ఓటర్ల పేర్లను తొలగించడం జరుగుతోందని పేర్కొన్నారు.జన సంరక్షణ -- మన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 36 వేల కందకాలను తవ్వడం జరిగిందని తెలిపారు.గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదేవిధంగా, రైతులకు ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించి, పంట విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు."అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించి, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసి, ప్రతి ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నర్సింహా రెడ్డి, అదనపు కలెక్టట్ ఎన్ వి గిరి, గ్రామ సర్పంచ్ రేఖ, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాఘవపూర్ గ్రామంలో
# రూ.10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

● ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాభివృద్ధికి మరింత ఊతం ● అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేస్తాం ● సర్పంచ్ ఎడ్ల వీనిల



**కామారెడ్డి రూరల్ జూన్ 10 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని రాఘవపూర్ గ్రామంలో గ్రామాభివృద్ధికి మరో ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద గ్రామానికి మంజూరైన రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల, ఉపసర్పంచ్ నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. గ్రామ ప్రజల ఎన్నో సంవత్సరాల డిమాండ్‌కు అనుగుణంగా గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడానికి ఈ నిధులు మంజూరు కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం ద్వారా రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామ సౌందర్యం కూడా పెరుగుతుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల వీనిల మాట్లాడుతూ గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మంజూరైన నిధులను పారదర్శకంగా వినియోగించి నాణ్యమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ఉపసర్పంచ్ నరేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ఈ పనుల ముఖ్య ఉద్దేశమని అన్నారు. గ్రామంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోందని, ఆ నిధులను సక్రమంగా వినియోగించి ప్రజలకు ఉపయోగపడే మౌలిక వసతులను కల్పించడం తమ బాధ్యత అని అన్నారు. పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చందన శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా భారీ స్థాయిలో నిధులు అందిస్తోందని అన్నారు. గ్రామాల మౌలిక వసతుల అభివృద్ధికి ఈ పథకం ఎంతో ఉ పయోగపడుతోందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరిస్తామని చెప్పారు.గ్రామ బీజేపీ అధ్యక్షుడు మంద రవి మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.శంకుస్థాపన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈ నరేష్, జీపీఓ రవి, గ్రామ సంఘం అధ్యక్షురాలు మంద లక్ష్మి, వార్డు సభ్యులు రంజిత్ గౌడ్, కిషన్, వసంత, సుజాత, గ్రామ పెద్దలు మంద స్వామి, మంద రాజ్‌కుమార్, మంద శేఖర్, ఆతుకూరి నరేష్, కొయ్యల సిద్దయ్య, మంద పెద్ద సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని అభివృద్ధి అవసరాలపై ప్రజలతో చర్చించి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై సూచనలు స్వీకరించారు. గ్రామంలో తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరగా, వాటిని దశలవారీగా పూర్తి చేస్తామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పనులు పూర్తయితే గ్రామంలో రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని అభిప్రాయపడ్డారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం వల్ల రాఘవపూర్ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని గ్రామస్థులు పేర్కొన్నారు.

# మంజీరా ఎత్తిపోతల పథకం భూసేకరణపై ఆర్ ఆర్ కమిటీ సమీక్ష



**కామారెడ్డి ప్రతినిధి జూన్ 10. (ప్రజాజ్యోతి)** మంజీరా ఎత్తిపోతల పథకం కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియపై ప్రాజెక్టు స్థాయి పునరావాస మరియు పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) కమిటీ బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించింది.ఈ సందర్భంగా పిట్లం మండలంలోని నాగంపల్లి, పెద్ద అన్నారం గ్రామాల్లో మంజీరా ఎత్తిపోతల పథకం కోసం చేపడుతున్న భూసేకరణ అంశాలను కమిటీ పరిశీలించింది. భూసేకరణలో అత్యల్ప విస్తీర్ణంలో మాత్రమే భూములను సేకరిస్తుండటంతో ఎటువంటి నివాస గృహాల నిర్వాసనం (డిస్ప్లేస్మెంట్) జరగడం లేదని, స్థానిక కుటుంబాల జీవనోపాధిపై కూడా ఎలాంటి ప్రతికూల ప్రభావం (లైవ్ లిహుడ్ ఇంపాక్ట్) ఉండదని కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో నాగంపల్లి, పెద్ద అన్నారం గ్రామాల్లో సేకరిస్తున్న భూములకు సంబంధించి భూ సేకరణ, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం-2013 (ర్ఫర్ యాక్ట్, 2013) ప్రకారం పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు (ఆర్ అండ్ ఆర్ బెన్ఫిట్స్) వర్తించవని కమిటీ నివేదించింది. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), బాన్సువాడ ఆర్డీవో, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సీపీవో, పిట్లం తహసీల్దార్, ఎస్‌బీఐ పిట్లం శాఖ మేనేజర్‌తో పాటు ఆర్‌డఆర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఫసల్వాది

# గ్రామ సభలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ (లా అండ్ ఆర్డర్) మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్

- రోడ్డు భద్రతపై "అరైవ్ అలైవ్ " సందేశంతో ప్రజలకు అవగాహన
- గమ్యస్థానానికి చేరుకోవడం ముఖ్యమే, కానీ సురక్షితంగా చేరుకోవడం మరింత ముఖ్యమైనది: డీజీపీ
- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్



**ప్రజా జ్యోతి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఫసల్వాడి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) మహేష్





మురళీధర్ భగవత్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫసల్వాడి గ్రామ సర్పంచ్ హరిప్రసాద్ మాట్లాడుతూ, ఈ సభ వేదికగా ఈ రోజు నుంచి హెల్మెట్, సీటు బెల్ట్ ధరించనిదే





గ్రామంలోని ఎవరికీ అనుమతి లేదని తీర్మానం చేసుకుంటున్నట్లు తెలిపారు. "నో హెల్మెట్ – నో ఎంట్రీ" విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. దేశంలో తెలంగాణ పోలీసు శాఖ పనితీరు ఆదర్శప్రాయంగా ఉందని, ట్రాఫిక్ నిబంధనలపై తమ ఫసల్వాది గ్రామంలో అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా ప్రజలను రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తం చేసి, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్ ఫసల్వాడి గ్రామానికి రావడం "అరైవ్ అలైవ్ " కార్యక్రమ ప్రాధాన్యతను తెలియజేస్తుందని అన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు, పాదచారులు అనేకులు ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకు ముఖ్య కారణం ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడమేనని అన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించి, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించి, పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, "అరైవ్ అలైవ్ " అంటే మన ప్రయాణం సురక్షితంగా సాగి, గమ్యస్థానానికి క్షేమంగా చేరుకోవడం అని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. జుట్టు చెడిపోతుందనో, సీటు బెల్ట్ వేసుకుంటే అసౌకర్యంగా ఉంటుందనో భావించి అజాగ్రత్తగా వ్యవహరించవద్దని అన్నారు. కుటుంబ యజమానిని కోల్పోతే ఆ కుటుంబానికి కలిగే నష్టం తీర్చలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫసల్వాడి గ్రామ సభ, "అరైవ్ అలైవ్ " కార్యక్రమానికి ముఖ్య అతిథి, తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేష్ మురళీధర్ భగవత్, ఐపీఎస్ గారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చిన్న మొబైల్ ఫోన్ కొనుగోలు చేస్తేనే, స్క్రీన్ గార్డ్ వేయిస్తామని, మొబైల్ కంటే మన ప్రాణాలు, మన ప్రయాణం ఎంతో విలువైనవని గుర్తించాలని సూచించారు. కావున మన ప్రాణరక్షణలో భాగమైన హెల్మెట్‌ను తప్పనిసరిగా కొనుగోలు చేసి వినియోగించాలని సూచించారు. కార్లలో ప్రయాణించేటప్పుడు డ్రైవర్ మాత్రమే కాకుండా ప్రయాణికులందరూ సీటు బెల్ట్ ధరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపరాదని, మద్యం సేవించినట్లయితే ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించాలని తెలిపారు. పండుగలకు అల్లుళ్లకు కొత్త బట్టలు బహుమతిగా ఇచ్చే సంప్రదాయం తెలంగాణ ప్రజలదని, తన తరఫున ఒక సూచనగా వారి ప్రాణరక్షణకు ఉపయోగపడే హెల్మెట్‌ను బహుమతిగా ఇస్తే మరింత మంచిదని అన్నారు. రహదారులపై వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. "గమ్యస్థానానికి చేరుకోవడం ముఖ్యమే, కానీ సురక్షితంగా చేరుకోవడం మరింత ముఖ్యమైనది" అనే భావనతో "అరైవ్ అలైవ్ " సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. యువత ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని ఇతరులకు కూడా చైతన్యం కల్పించాలని కోరారు. అనంతరం గ్రామ ప్రజలతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎంహెచ్‌వో లలిత, ఆర్డీవో రాజేందర్, రవాణా శాఖ జాయింట్ కమిషనర్ వెంకటరమణ, డీఎస్పీ సత్యయ్య గౌడ్, ఎమ్మార్వో దశరథ్, జిల్లా పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వార్డు అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- అభివృద్ధి దిశలో 15 వ వార్డు
- అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం
- 15 వ వార్డు కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ – శ్రీనివాస్



**దుబ్బాక ప్రతినిధి, జూన్ 10( ప్రజా జ్యోతి)** 15వ వార్డ్ అభివృద్ధికి వార్డు సభ్యులంతా సహకరించాలని కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ – శ్రీనివాస్ అన్నారు. బుధవారం రోజున 15వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డ్ ఆఫీసర్ జ్యోతి మేడం తో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ మాట్లాడుతూ... వచ్చే



వర్షాకాలంలో తీసుకునే జాగ్రత్తలు, విష జ్వరాల నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో వారికి వివరించి తెలిపారు. మరియు అంగన్వాడి పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్వాడిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. వార్డు ప్రజలు తమ చెత్తను తడి చెత్తగా పొడి చెత్తగా వేడివేడి చేసి మున్సిపల్ వాహనంలో వేయాలని సూచించారు. మహిళలకు మహిళ శక్తి ఆధ్వర్యంలో ఇచ్చే రుణాల గురించి వివరించి అలాగే ఎవరైనా వృద్ధులు వికలాంగులు వితంతువులు పెన్షన్ రాకుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు అందుతుందని ఎవరు కూడా అధర్యపడవద్దని కౌన్సిలర్ అనంతుల భాగ్యమ్మ సూచించారు. ఇప్పటికే 15వ వార్డులో డ్రైనేజీలు సిసి నిర్మాణాలు జరుగుతున్నాయని వారు తెలిపారు . ఇంకా ఎవరింటి వద్దనైనా డ్రైనేజీ నిర్మాణం ఇబ్బందిగా ఉంటే తెలపాలన్నారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకుంటే పోరాటం తథ్యం!

- జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి
- హెల్త్ కార్డును ప్రకటించాలి
- ఈ నెలాఖరులో జిల్లా యూనియన్ మహాసభ
- టీయూడబ్ల్యూజే(ఐజేయు) తీర్మానం

**అల్లాదుర్గం జూన్ 10 (ప్రజాజ్యోతి)** సంగారెడ్డి జిల్లా లో మిగిలిన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సంగారెడ్డిలో యూనియన్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్, ఆందోల్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భూమయ్య, రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యులు మునిపల్లి యాదగిరి ఈ సమావేశానికి హాజరయ్యారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యపై, హెల్త్ కార్డుల అంశంపై చర్చించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించాలని తీర్మానించారు.



అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా హెల్త్ కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డుల జారీలో చాలా ఆలస్యం అవుతుందని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయినప్పటికీ తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ అహ్మద్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి అనేకసార్లు విన్నవించడం జరిగిందని చెప్పారు.దీని ఫలితంగానే అనేక సవరణలు వచ్చాయని, దానివల్లనే చాలామందికి అక్రిడేషన్ కార్డులు జారీ అయ్యాయని వివరించారు. మిగిలిన వారికి కూడా ఎలాంటి కొర్రీలు వేయకుండా తక్షణమే కార్డు మంజూరు చేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. తమ సంఘానికి పోరాటం కొత్త కాదని, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం గా టీయూడబ్ల్యూజే ఉన్నదని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమమే తమ సంఘం ధ్యేయమని ఆయన చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఈ నెలాఖరులో జిల్లా మహాసభను నిర్వహిస్తామని, జిల్లా కమిటీని ఎన్నుకుంటామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్ తెలిపారు. యూనియన్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ సూచించారు. ఇతర ముఖ్య నేతలు అక్రమ్ పటేల్, మసూద్ ఖాన్, శ్రీనాథ్, బాసిత్, అన్వర్ హుస్సేన్, హాజీ, మినాజ్, సిద్ధిక్, విష్ణు వర్ధన్, జోగిపేట భూమన్న, యాదగిరి, అబ్దుల్ మతిన్, విల్సన్, అంజయ్య ,సంగమేశ్ వెంకటేష్ గౌడ్ సిద్ధు, రమేష్ గౌడ్, సత్తార్,తదితరులు పాల్గొన్నారు.

# అజాగ్రత్తే ప్రమాదాలకు కారణం... అప్రమత్తతే ప్రాణాలకు రక్షణ...

- ప్రమాద రహిత మెదక్ లక్ష్యంగా 'అరైవ్ అలైవ్' మహా ఉద్యమం
- గ్రామసభ నుంచి రహదారి వరకు ప్రజల భద్రతే ప్రధాన అజెండా
- రోడ్డు ప్రమాదాల్లో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదు
- అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్
- ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం- కలెక్టర్ ప్రతిమా సింగ్
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాణరక్షకాలు – ఎస్పీ శ్రీనివాసరావు





**వెల్దుర్తి–మాసాయిపేట్ (ప్రజాజ్యోతి) జూన్ 10:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులతో కలిసి భారీ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించి, అనంతరం అవగాహన సదస్సు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్



జైన్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పచ్చదనం, పారిశుధ్యం, చెత్త నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, తగులబెట్టడం పూర్తిగా నివారించాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్య



నిర్వహణ, పైపులైన్ల మరమ్మత్తులు, నీటి ట్యాంకుల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. పోలీసు, రవాణా, ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రమాద బాధితులను రక్షించి సహాయం చేసే వారిని రహవీర్‌గా గుర్తించి గౌరవిస్తారని పేర్కొన్నారు. రహదారి భద్రత అంటే ప్రతి ఒక్కరి భద్రతేనని,రోడ్డు ప్రమాదాల్లో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణలో ప్రతి సంవత్సరం 7,500కు పైగా మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండగా, మెదక్ జిల్లాలో సగటున 250 మంది మరణిస్తున్నారని తెలిపారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వల్లే అధికంగా ప్రాణనష్టం సంభవిస్తోందని తెలిపారు. విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు, వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని



సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు కళాబృందం పాటల ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించగా, అధికారులు, విద్యార్థులు, పౌరులు కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి, తూప్రాన్ ఆర్డీవో బావయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

- ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీపై కఠిన చర్యలు అవసరం: ఏబీవీపీ

**అందోలు జూన్ 10, (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేసింది. సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి మండలంలో ఏబీవీపీ మండల కన్వీనర్ సాయి కృష్ణ ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రం అధికారికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని వారు కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రపరచడం, అవసరమైన చోట కొత్త మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడం, తరగతి గదుల్లో బల్లలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఫ్యాన్లు వంటి మౌలిక వసతులను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ద్వారా మాత్రమే పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అదేవిధంగా, అనేక ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలను బలవంతంగా విక్రయిస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మరోవైపు కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు, ఆటస్థలాలు, పార్కింగ్ సదుపాయాలు కూడా లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల సంక్షేమం, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణ కోసం సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ మండల కన్వీనర్ సాయికృష్ణతో పాటు సతీష్, నిఖిల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన

- మండల విద్యాధికారి విజయభాస్కర్ రెడ్డి

**ములుగు, జూన్10 (ప్రజా జ్యోతి)** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యాబోధనను అందించి ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో100% ఉత్తీర్ణత సాధించామని మండల విద్యాధికారి,ములుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన ములుగులో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి తిరిగి చదువుకునే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు మండల విద్యాశాఖ అధికారి సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో దోహదపడతాయని,ప్రైవేటు పాఠశాలలలో ఉపాధ్యాయుల



విద్యా బోధన కంటే ప్రభుత్వ పాఠశాలలలోని ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధనను అందించి మెరుగైన ఫలితాలు సాధించుటకు శాయశక్తుల కృషి చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని, పాఠశాలలలో మెరుగైన సౌకర్యాలు అందిస్తూ మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందిస్తున్నట్లు ఆ తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఆలోచించి మీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరా నగర్ కాలనీలో చెత్తాచెదారంతో దుర్వాసన

- ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాలను ఏర్పాటు
- మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్‌కు ఘన సన్మానం



**కూకట్ పల్లి, జూన్ 10 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ ఇందిరానగర్ నుండి గూడ్స్ షెడ్ రోడ్ వరకు ఉన్న రోడ్ మొత్తం వాహనాలు నిలిపి, చెత్తా చెదారంతో పేరుకుపోయి ఉన్న విషయం మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి ఆయన సమస్యను పరిష్కరించి, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సి.సి. కెమెరాను ఏర్పాటు చేయించినందుకు ఆయనకు స్థానిక ప్రజలు ఘనంగా సన్మానించారు. కాలనీలో చెత్తాచెదారం, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న తరుణంలో శ్రావణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని స్థానికులు కొనియాడారు. ఈ సందర్భంగా ఇందిరా నగర్ బస్తీ వాసులు శ్రావణ్ కుమార్ ని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గరిగె తుకారాం, బాలరాజు గౌడ్, ఇనుగంటి రాజు, చెరుకు సత్యనారాయణ, యాదిలాల్, శ్రీనివాస్, స్వామి గౌడ్, గణేష్ యాదవ్, నరేష్ , ఎం.సరిత, శోభ, అనసూయ, యశోద తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం..!

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య
- తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలపై ప్రజల వినతులు
- త్వరితగతిన పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే యాదయ్య
- చేవెళ్లలో ఘనంగా 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' వార్డు సభలు



**చేవెళ్ల, జూన్ 10(ప్రజా జ్యోతి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 12 నుంచి 18 వార్డులకు సంబంధించిన వార్డు సభలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, స్థానిక సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, పచ్చదనం పెంపు, ప్రజల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే ఫలితాలు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సభల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, రోడ్లు, పారిశుధ్య సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని వార్డు కౌన్సిలర్లు హామీ ఇచ్చారు.

**స్వచ్ఛ చేవెళ్ళే లక్ష్యం :** మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి వీధి, ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచడమే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని కోరారు. స్వచ్ఛ చేవెళ్ల నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

**ప్లాస్టిక్ పునర్వినియోగంపై అవగాహన :**
మున్సిపల్ సిబ్బంది ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి వినియోగించే విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలను వివరించి, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించారు.

**ఓటర్ రివిజన్‌పై ప్రత్యేక ఏర్పాట్లు :** ఓటర్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌ఓల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలను సభా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఓటర్ల వివరాలను 2002 రికార్డులతో సరిపోల్చేందుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజ ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు ధవల్గారి గోపాల్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మంగలి కళ్యాణి యాదగిరి, అత్తెల్లి మనీషా అనంతరెడ్డి, కృష్ణా నాయక్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు పడాల ప్రభాకర్, రెడ్డిశెట్టి మధుసూదన్ గుప్తా, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, నాయకులు అత్తెల్లి రవీందర్‌రెడ్డి, మల్గారి శ్రీకాంత్‌రెడ్డి, కవాడి రాజవర్ధన్‌రెడ్డి, పిసరి దామోదర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ గంగా, ఏవో శంకర్ లాల్, డాక్టర్ వేదశ్రీ విద్యుత్ శాఖ అధికారులు, వార్డు ప్రజలు, ఆశా వర్కర్లు, జిపిఓలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





## 13వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి





- వార్డు సమస్యలపై వార్డు సభ.. కమిషనర్‌కు వినతి
- బీసీ కాలనీలో వర్షపు నీరు పరిష్కారానికి కౌన్సిలర్ సమీనా తాహేర్ అలీ విజ్ఞప్తి

**పరిగి, జూన్ 10 (ప్రజాజ్యోతి) :** పరిగి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం వార్డు కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు డ్రైనేజీ, సీసీ రోడ్లు, పెన్షన్లు, విద్యుత్ అలాగే తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్, కమిషనర్ మల్లేష్, వార్డు ఆఫీసర్ ఫరూక్, బిల్ కలెక్టర్ శేఖర్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొని ప్రజల సమస్యలను విన్నారు. అనంతరం 13వ వార్డులో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం కౌన్సిలర్ సమీనా తాహేర్ అలీ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. బీసీ కాలనీలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతున్నందున డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని, వార్డులో విద్యుత్ స్తంభాల కొరత, లో-వోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత శాఖల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంతు నరేందర్, చాంద్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ సమీర్, ఖదీర్, అంజద్, యూసుఫ్, విద్యుత్ శాఖకు చెందిన సమద్‌తో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులు వర్షాధారపు పంటలకే ప్రాధాన్యతనివ్వాలి

- ప్రజా సమస్యల కోసమే సదస్సులు
- అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది
- ఎంపీడీవో విశ్వప్రసాద్
- అంతారం గ్రామ సర్పంచ్ లక్ష్మి





**తాండూరు జూన్ 10 ప్రజాజ్యోతి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జరిగిన ప్రజా పాలన సదస్సులో తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్, వ్యవసాయ శాఖ ఏఈఓ సుమ స్థానిక రైతులు,ప్రజలకు పలు సూచనలు చేశారు. తాండూరు మండలం అంతారం రైతు వేదిక భవనంలో గ్రామ సర్పంచ్ జంగని లక్ష్మీ అధ్యక్షతన జరిగిన ప్రజా సదస్సులో వారు మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు పంటల మార్పిడి చేయడంతో పాటు వర్షధారపు పంటలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అంతే కాకుండా ప్రభుత్వం ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు సకాలంలో అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. అంతేకాకుండా రైతులు ఎవరు కూడా విత్తనాలు ఎరువులు కొనే సమయంలో తప్పనిసరిగా సంబంధిత దుకాణా దారు నుండి రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడం కోసం స్థానిక సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులలో ఏ విధమైన జాపం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. భూగర్భ జలాలు పెంచడం కోసం ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రణాళిక చేసుకోవాలని ఎంపీటీవో సూచించారు. వర్షాకాలంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం జరిగిన ఎలాంటి ఇబ్బందికరంగా ఉన్న సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, ఉప సర్పంచ్ వడ్డే రవి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు రైతులు మహిళలు పాల్గొన్నారు.

## బషీరాబాద్ గ్రామపంచాయతీని అభివృద్ధి చేస్తా

- సర్పంచ్ వెంకటేష్ మహారాజ్



**బషీరాబాద్ జూన్ 10 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని సర్పంచ్ వెంకటేష్ మారాజు తెలిపారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో ఆయన పాల్గొని గ్రామ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటేష్ మహారాజ్ మాట్లాడుతూ బషీరాబాద్ మండల కేంద్రంలో నుంచి జీవన్గి టు కరణ్ కోట్ వరకు డబుల్ రోడ్డు విస్తరణ, గ్రామంలోని పాత ఇండ్ల సమస్యలు స్మశాన వాటిక, సిసి రోడ్స్ మురుగు కాలువలు, శిథిలా వ్యవస్థకు చేరిన వాటర్ ట్యాంక్, పలు సమస్యలపై గ్రామసభలు చర్చించినట్లు తెలిపారు. బషీరాబాద్ మండలానికి పబ్లిక్ స్కూల్ మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు వెంటనే పనులు మొదలు చేస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం కూడా అవసరమని అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు సమాన్యాయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలు వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ అన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో బషీరాబాద్ గ్రామపంచాయతీకి అధిక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంపత్ కుమార్, సెక్రెటరీ బాలకృష్ణ, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఉప సర్పంచ్ రజాక్, వికారాబాద్ జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు జానకి,వార్డ్ మెంబర్స్ శ్రీకాంత్, రాము, రాఘవేందర్, గ్రామ పెద్దలు, పవన్ ఠాకూర్, సాయిలు గౌడ్, సిద్దు, నర్సింలు, రవి, రాములు,హెడ్ కానిస్టేబుల్ లోక్య నాయక్, అంగన్వాడి టీచర్స్, డ్వాక్రా మహిళలు, ఆశ వర్కర్లు, గ్రామ యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శిల్పా ఎవెన్యూ పార్కు స్థలాన్ని కబ్జా...

## ప్రహరి గోడను కూల్చివేసిన కబ్జా రాయుళ్లు





- కంటెయినర్ వేసి దర్జాగా కబ్జాకు పాల్పడినా పట్టించుకోని అధికారులు
- కబ్జా రాయుళ్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి, జూన్ 10 (ప్రజా జ్యోతి) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి డివిజన్ పరిధిలోని శిల్ప ఎవెన్యూ పార్క్ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్న విషయం స్థానిక కాలనీ వాసుల ద్వారా తెలుసుకున్న కూకట్ పల్లి ఏమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం పరిశీలించారు. స్థానికులతో కలిసి పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న క్రమంలో అక్కడ ఉన్న కొందరు కబ్జా దారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో పార్క్ చుట్టూ గతంలోనే నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేసి ఏకంగా కంటెయినర్ వేసి దర్జాగా కబ్జాకు పాల్పడినా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ పార్కులను కూడా కబ్జా చేస్తున్న అధికారులు కళ్లు మూసుకోవడం దారుణమని మండిపడ్డారు. కోట్లాది రూపాయల విలువైన భూములను పట్టపగలు కబ్జా చేస్తున్న అధికారులకు చీమ కుట్టినట్లుగా కూడా లేదని, శిల్ప లే అవుట్ లోని పార్కు స్థలాన్ని పరిరక్షించేందుకు చాలా కాలం కిందటనే జిహెచ్ఎంసి అధ్వర్యంలో ప్రహరీ గోడలను నిర్మించారని తెలిపారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా కబ్జా దారుల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సి యం సి కమిషనర్ జి సృజన కలసి పార్క్ కబ్జా విషయముపై పిర్యాదు చేసారు. కబ్జా దారుల నుండి పార్కును రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమములో మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ రావు, కృష్ణా రెడ్డి, రాజేష్, సాయి శ్రీనివాస్, భారతి, కన్నలతా, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తడి,పొడి చెత్తపై అవగాహన అవసరం

- నందిగామ ఇన్చార్జ్ ఎంపీడీవో సిహెచ్ అరుంధతి
- సిడి తాండలో సర్పంచ్ గబ్రు చౌహన్ ఆధ్వర్యంలో తడి,పొడి చెత్త పై అవగాహన

**కొత్తూర్ జూన్ 10 (ప్రజా జ్యోతి) :** తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరం అని నందిగామ ఇన్చార్జ్ ఎంపీడీవో సిహెచ్ అరుంధతి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రజా ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం నందిగామ మండలంలోని సిడి తాండలో సర్పంచ్ గబ్రు చౌహన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తడి,పొడి చెత్త పై అవగాహన సదస్సు కార్యక్రమానికి ఇన్చార్జి ఎంపీడీవో సిహెచ్ అరుంధతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రజలకు,ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పిస్తూ తడిచెత్త,పొడిచెత్తను వేరు వేరు చేసి గ్రామపంచాయతీ వాహనల్లో పంచాయతీ సిబ్బంది ద్వారా తరలించాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గబ్రు చౌహన్ మాట్లాడుతూ.. ఇంటింటా తడి, పొడి, ప్రమాదకర చెత్త సేకరణపై ప్రజలకు సర్పంచ్ అవగాహన కల్పించారు.చెత్తను వేర్వేరుగా సేకరించడానికి ప్రతి ఇంటికి మూడు డబ్బాల చొప్పున పంపిణీ చేశారు. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేసి మొక్కలకు ఉపయోగించవచ్చని, పొడి చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా తిరిగి ఉపయోగించుకోవచ్చని ప్రజలకు సర్పంచ్ గబ్రు చౌహాన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చక్రధర్ గౌడ్, ఉపసర్పంచ్ రవీందర్ నాయక్, వార్డు సభ్యులు,తాండ వాసులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.







## ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు సభలు దోహదం

: కౌన్సిలర్ హబీబున్నిసా అయ్యూబ్



**పరిగి, జూన్ 10 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరిగి మున్సిపాలిటీ 8వ వార్డులో బుధవారం వార్డు కౌన్సిలర్ హబీబున్నిసా అయ్యూబ్ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇంటి నంబర్ల కేటాయింపు, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, పింఛన్ల మంజూరు, విద్యుత్ మరియు తాగునీటి సమస్యలపై ప్రజలు తమ వినతులను తెలియజేశారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్, కమిషనర్ మల్లేష్, వార్డు ఆఫీసర్ ఫరూక్, బిల్ కలెక్టర్ శేఖర్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే స్థానికులు అంజి, శివాజీ, అమీర్, రషీద్ భాయ్, సైదుల్, సలీం, ముజామ్మిల్, నసీర్, జాదూ శేఖర్, ముజాక్కర్ తదితరులు హాజరై తమ సమస్యలను అధికారులకు వివరించారు. వార్డు అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

## బషీరాబాద్ గ్రామ కార్యదర్శిగా బాలకృష్ణ బాధ్యతలు స్వీకరణ



**బషీరాబాద్ జూన్ 10 ప్రజా జ్యోతి :** బషీరాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా బాలకృష్ణ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. తాండూరు మండలం సంగెం కాలన్ గ్రామపంచాయతీ నుంచి బదిలీపై బషీరాబాద్ గ్రామ పంచాయతీగా ఇన్చార్జి బాధ్యతలు తీసుకోవడం జరిగింది. ఇప్పటివరకు బషీరాబాద్ గ్రామపంచాయతీలో విధులు నిర్వహించిన కార్యదర్శి జయకర్ నల్గొండ జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంలో వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి గ్రామపంచాయతీకి సిబ్బందికి ప్రజా ప్రతినిధుల మరియు ప్రజల సహకారంతో సమన్వయంగా పనిచేస్తున్నాను తెలిపారు.

## బస్తీలో నెలకొన్న ప్రతి సమస్య పరిష్కరిస్తా

- పాపిరెడ్డి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి



**కూకట్ పల్లి, జూన్ 10 (ప్రజా జ్యోతి) :** బస్తీలో నెలకొనే ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం కురిసిన వర్షంతో బస్తీలోని పలు రోడ్లలో వరద నీరు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న చంద్రారెడ్డి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో బుధవారం సంబంధిత అధికారులు ఆయా ప్రాంతంలో పర్యటించి వారి సిబ్బంది చేత వరద నీరు రోడ్లపై నిల్వకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంలో చంద్రారెడ్డి బస్తి వాసులతో కలిసి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ సుధాకర్, అస్బస్టస్ కాలనీ అధ్యక్షుడు నరేష్, నేతలు కె.యాదగిరి, శంకర్ రెడ్డి, లక్ష్మణ్, దాకోరి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ కొత్త మార్గదర్శకాలతో ఇబ్బందులు

- వెల్లడించిన ఇస్యా సెంటర్ అధ్యయనం



**హైదరాబాద్, జూన్ 10 (ప్రజా జ్యోతి) :** సబ్స్క్రిప్షన్ ఆధారిత రైడ్-హెయిలింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై సీజీఎస్టీ చట్టంలోని సెక్షన్ 9(5) కింద జీఎస్టీ విధించడం వల్ల డ్రైవర్ల ఆదాయం తగ్గడం, ప్రయాణికులపై అదనపు భారం పడడం, భద్రతా ప్రమాణాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఇస్యా సెంటర్ విడుదల చేసిన అధ్యయనంలో తేలిందని ఇస్యా సెంటర్ డైరెక్టర్ మేఘనా బాల్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈవై ట్యాక్స్ పార్ట్నర్ జయశ్రీ పార్థసారథి తోకలసి ఆయన మాట్లాడుతూ డిజిటల్ మొబిలిటీ రంగంలో కొత్త వ్యాపార నమూనాలకు అనుగుణంగా పన్ను విధానాలను పునః సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సెక్షన్ 9(5) కింద జీఎస్టీని ప్లాట్‌ఫారమ్‌లు రైడ్ ధరలను నిర్ణయించే లేదా చెల్లింపులను నియంత్రించే సందర్భాల్లో మాత్రమే వర్తింపజేయాలని కోరారు. అలాగే భద్రత, వెరిఫికేషన్, పర్యవేక్షణ వంటి విధులను పన్ను ప్రయోజనాల కోసం లావాదేవీల నియంత్రణగా పరిగణించరాదని సూచించారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

## క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,జూన్ 10 (ప్రజాజ్యోతి )
రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టు పరిశ్రమ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు, వాటి ప్రగతి వివరాలను కలెక్టర్‌కు వివరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ రైతుల సమస్యలను తెలుసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండలాల వారీగా సాగు భూముల




విస్తీర్ణం, సాగవుతున్న పంటలు, ఆయిల్ పామ్, వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, పూలు, పండ్ల తోటల వివరాలు, భూముల స్వరూపం, వర్షపాతం పరిస్థితులు, రైతు వేదికల ద్వారా అందుతున్న సేవలు, రైతులకు అనుకూల, ప్రతికూల అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.
ఈ ప్రక్రియలో మండల వ్యవసాయ అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ సమన్వయ బాధ్యతలు అప్పగించారు.జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు విధానాలపై అవగాహన పెంపొందించేందుకు త్వరలో వ్యవసాయ విస్తరణ అధికారులకు (ఏఈఓలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి ని ఆదేశించారు.జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు పంటల మార్పిడి విధానం, ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.ఈ సమీక్ష సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు, డివిజన్ మరియు మండల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామ సభలు

ఎండపల్లి,జూన్ 10, ప్రజా జ్యోతి
ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక గ్రామ సభలు అని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు,




పచ్చదనం,మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేకంగా చర్చించారు,అలాగే ఇప్పటి వరకు జరిగిన పలు అభివృద్ధి పనులను వివరించడం జరిగింది,ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, ఎంపీడీవో కృపాకర్, ఎస్ ఐ పి ఉదయ్ కుమార్,గ్రామీణ నీటి సరఫరా ఏ ఈ సాయి కుమార్,గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్,గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్,ఉప సర్పంచ్ అరిగెల జయవ్వ, వార్డు సభ్యులు,రామగిరి రజిత, చెనెల్ల వేణు పాలకుర్తి తిరుపతి,మూల ప్రశాంత్,జైనపురం తిరుపతి,బిసగోని అంజలి,జక్కుల మల్లీశ్వరి , గౌరి చంద్ర మౌళి, గొల్లపెల్లి నాగలక్ష్మి ,వ్యవసాయ విస్తరణ అధికారిని లావణ్య, పల్లె దవాఖాన వైద్యాధికారినీ రక్షిత, అంగన్వాడి టీచర్లు,మహిళా సంఘాల ప్రతినిధులు,ఆశా కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,

# ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా మెరుగు జానీ నియామకం

ఎండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి
రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం కార్యదర్శిగా మెరుగు జానీ నియామకం అయ్యారు,జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రోజున ఏ బి కన్వేషన్ హాల్ లో ఉప సర్పంచ్ ల పోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ అద్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది,ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా ఎండపెల్లి మండలం రాజారాంపల్లి గ్రామ ఉపసర్పంచ్ మేరుగు జంపన్న అలియాస్ జానీ ని రాష్ట్ర కార్యదర్శి గా నియమిస్తూ అలాగే పూర్తి మండలాల ఉప సర్పంచులు హాజరు కానందున తాత్కాలిక జిల్లా కమిటి వేయడం జరిగింది అని మేరుగు



జానీ ఒక ప్రకటనలో తెలిపారు,అలాగే జిల్లా కన్వీనర్ లుగా ముత్యాల స్వామి మల్లన్నపేట కో కన్వీనర్ గురిజాల బుచ్చిరెడ్డి గొల్లపెల్లి కన్వీనర్ లుగా జంగ్ లావణ్య శ్రీనివాస్ బుగ్గారం గుర్రపు తిరుపతి గంగాపూర్ సింహరాజు క్రాంతి కొత్తపేట కందరి ముత్యపురెడ్డి ముత్యంపేట వారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది,ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు కటుకం స్వప్న అలాగే రాష్ట్ర నాయకులు మహ్మద్ రఫీ,ఉప సర్పంచులు హాజరయ్యారు,కాగా ఉప సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియామకం కావడం పట్ల మండల ప్రజలు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు,

# పీఎం శ్రీ బీర్ పూర్ ప్రాథమిక పాఠశాలలో 'బడిబాట' అవగాహన: విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యం

బీర్‌పూర్, జూన్ 08 (ప్రజా జ్యోతి):
బీర్ పూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు 'బడిబాట' కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.ప్రస్తుతం బీర్ పూర్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఆవరణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ కౌన్సిలర్ ప్రణీత




ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఉచిత టైలరింగ్, బ్యూటీ పార్లర్ శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణా శిబిరానికి బడిబాట బృందంతో వెళ్లిన ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు అక్కడ ఉన్న మహిళలను కలిసి కమ్యూనిటీ మోటివేషన్ చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా వారిని సంప్రదించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ, తమ పీఎం శ్రీ పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందుతోందని వివరించారు. గతంలో తమ పాఠశాల నుండి గురుకుల పాఠశాలలకు ఎంపికైన విద్యార్థుల వివరాలను వారికి తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలైన రెండు జతల యూనిఫారాలు, డిజిటల్ ఎడ్యుకేషన్, ఇంగ్లీష్ మీడియం బోధన, పాఠశాలలోని కిచెన్ గార్డెన్ విశిష్టతలను వివరించి మోటివేట్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ కౌన్సిలర్ ప్రణీత, శిక్షకురాలు రమ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల శ్రీలత, ఎస్ హెచ్ జి మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, భోగ నాగరాణి, బాణావత్ స్వరూప, కందుకూరు లలిత, గంగిపల్లి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# మోదీజీ వర్ధిల్లు నూరేళ్లు..

## 2047 వరకు మోదీనే ప్రధాని: కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ బ్యూరో,జూన్ 10( ప్రజాజ్యోతి ):
దేశాన్ని ప్రపంచంలోనే విశ్వగురు స్థానంలో నిలబెట్టే వరకు



ప్రధాని నరేంద్ర మోదీ విశ్రమించబోరని, 2047 వరకు ఆయనే దేశ ప్రధానిగా కొనసాగుతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.భారత ప్రధానిగా 4,398 రోజులు పూర్తి చేసుకుని జవహర్‌లాల్ నెహ్రూ అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును అధిగమించిన సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, దేశాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు మరింత శక్తిని ప్రసాదించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం మీడియాతో మాట్లాడిన బండి సంజయ్, నెహ్రూ పాలనలో అవినీతి, బంధుప్రీతి, అస్తవ్యస్త పాలన కొనసాగిందని, అయితే మోదీ నాయకత్వంలో నిజాయితీ, నిబద్ధతతో కూడిన పరిపాలన సాగుతోందని అన్నారు. గత 12 ఏళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చారని, రోడ్లు, రైల్వేలు, విమానయాన, టెలికమ్యూనికేషన్ రంగాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు.
గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సమగ్ర అభివృద్ధి జరుగుతోందని, అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాల ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరేలా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అలాంటి గొప్ప నాయకుడు మోదీ మరింత కాలం దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. రాజ్యసభ నామినేషన్ పత్రాల వ్యవహారంపై స్పందిస్తూ, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోనిదేనని, దానిపై ఎన్నికల కమిషన్ తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, బీజేపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో అక్రమాలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల ప్రతినిధి, జూన్ 10(ప్రజాజ్యోతి):
జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగిందని, ఇందులో అక్రమాలు జరిగాయని నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




సవాల్ విసిరారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గత యాసంగి సీజన్‌లో 80 వేల మంది రైతుల నుండి 4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 5.12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటికే 5.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో మొత్తం 436 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 417 కేంద్రాల్లో ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 19 కేంద్రాల్లో కొనుగోలు కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 1,215 కోట్ల విలువైన ధాన్యం సేకరించి, 79,736 మంది రైతుల ఖాతాల్లో రూ. 1,075 కోట్లు జమ చేశామని పేర్కొన్నారు. జిల్లాలో వడ్ల కొనుగోలులో రూ. 107 కోట్ల అవినీతి జరిగిందని మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దీనిని నిరూపించలేకపోతే వారు బాధ్యత వహించాలని అన్నారు. అలాగే, ధర్మపురిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలనుఖండించారు. కేవలం స్థానిక ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ నిర్మాణాల అవసరాల కోసం మాత్రమే గోదావరి నుండి ఇసుకనుతీసుకుంటున్నామని, ఇందులో ఎలాంటి అక్రమాలు లేవని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినవాయకులు, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పిస్తుంటే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కొనుగోలు ప్రక్రియలో నిరంతరం శ్రమించిన అధికారులను ఆయన అభినందించారు.

# ప్రజా పాలన – పట్టణ ప్రగతిలో భాగంగా 33వ వార్డు సభ

## వార్డు అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో కార్యాచరణ

## సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం

## కౌన్సిలర్ గంగుల సంధ్యారాణి సతీష్

పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 10 ప్రజాజ్యోతి:
ప్రజా పాలన – పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం 33వ వార్డు వార్డు సభను గౌరవ కౌన్సిలర్




గంగుల సంధ్యారాణి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న వివిధ సమస్యలు, ప్రజల అవసరాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. సభలో మాట్లాడిన కౌన్సిలర్ గంగుల సంధ్యారాణి సతీష్, వార్డు అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వార్డులోని ప్రతి కుటుంబాన్ని కలుపుకొని, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వార్డులో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నేతలు

సుల్తానాబాద్, జూన్ 10: (ప్రజా జ్యోతి)
ఇటీవల సుల్తానాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పొన్నమనేని రంజిత్ రావును బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత వుస్తాం రవీందర్, నాయకులు పురం రమణ, లంక శంకర్ తదితరులు సీఐని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.




ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేసి పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. పట్టణం, మండల పరిధిలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# జాతీయస్థాయి కర్ర సాము విద్యలో ప్రతిభ

కొనరావుపేట, జూన్.10 (ప్రజాజ్యోతి)
జాతీయస్థాయి కర్ర సాము సెమినార్, క్యాంపులో అత్యంత ప్రతిభ అవార్డును సన్ రైజ్ తైక్వాండో సెక్రటరీ, కోచ్ ఎం. శ్రీనివాస్ సొంతం చేసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ ఈ నెల 7, 8, 9, 10 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సింహపురి నగరం (నెల్లూరు)లో కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కర్రసాము శిక్షణా శిబిరం, సెమినార్‌లో తెలంగాణ రాష్ట్రం, రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి ఎం. శ్రీనివాస్ కర్రసాము విద్య శిబిరం లో పాల్గొని,విశేష ప్రతిభ కనబరిచడం జరిగిందన్నారు. కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్‌ను కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ, మాస్టర్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో కోచ్‌లు రాజేందర్ మాస్టర్, ,మాస్టర్ రమేష్, దశరథం, అరవింద్ లు ఉన్నారు. ఈ ప్రతిభ కనబరిచిన శ్రీనివాసును తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి సంతోష్ అభినందించారు.

# పంట వ్యర్థాలను తగలబెడితే జరిమానా తప్పదు





**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి :** పంట వ్యర్థాలను రైతులు పొలాలలో తగలబెడుతున్నారని..అలా చేస్తే జరిమానా తప్పదని కొత్తకొత్తూరు సర్పంచ్ మాళోత్ కళావతీ అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా... భూమిలోనే కలియదున్నటం వలన అనేక ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. కాదని తగలబెడితే ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న వ్యవసాయ సీజన్లో రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో అప్రమతంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు ఇంటి పరిసరాల ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డు సభ్యులు గుగులోత్ వెంకటి, పాగర్తి శ్రీను, ఠాగూర్ రామ్సింగ్, పంచాయతీ కార్యదర్శి రవి, జీపీవో జానిమియా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా దేవాలయం వార్షికోత్సవం







**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి:** మండలం లోని మంగాపురంతండా లోని శ్రీ రామాలయ 15 వ వార్షికోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం లోని ఉత్సవమూర్తు విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. శ్రీరామ నామస్మరణంతో దేవాలయం మారుమోగింది. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హైద్రాబాద్ కు చెందిన శ్రీ హరిహార నాట్యాలయం వారి ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటా, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి. సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి, రాజారాంపేట సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, గోబ్రియా నాయక్ , మల్లికార్జున్,తో పాటు రామాలయం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ చారిత్రక
# రికార్డు చిత్రపటానికి పాలాభిషేకం: ప్రత్యేకపూజలు





**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజాజ్యోతి :** దేశ ప్రధాని నరేంద్రమోడీ సుధీర్ఘకాలంగా పాలన సాగిస్తున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత మోడీ చిత్ర పటంకు పాలాభిషేకం చేశారు. అనంతరం దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు ఫాగర్తి సుధాకర్ మాట్లాడారు...దేశానికి నిరంతరంగా సేవలు అందించిన నాయకుడు గా మోడీ చారిత్రక రికార్డు ను సాధించారని పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి గా, దేశ ప్రధాన మంత్రి గా విరామం లేకుండా పాలన సాగించారని పేర్కొన్నారు. మూడో సారి పీయం గా బాధ్యతలు చేపట్టిన లి అరుదైన రికార్డు ను సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పురాణం దివాకర్, పుట్టా సత్యనారాయణ, కట్టా అప్పారావు, ఎలిగేటి వెంకటేష్, నరసింహారావు, "దేశబోయిన వేణు, కృష్ణారావు, జోగుపర్తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో
# రైళ్లు హాల్ట్‌ను ఏర్పాటు చేయాలి

- ఫ్లాట్‌ఫారమ్, లైటింగ్, టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి
- తుర్రవారిగూడెం సర్పంచ్, ఉప సర్పంచ్ డిమాండ్



**అశ్వాపురం, జూన్ 10, ప్రజా జ్యోతి పత్రిక** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్లను నిలపడంతో పాటు, స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని తుర్రవారిగూడెం గ్రామ సర్పంచ్ కుంజ జాన్ గారు మరియు ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ రైల్వే శాఖను డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అశ్వాపురం మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో కీలకమైనదన్నారు. అయితే, ఇక్కడ రైళ్లు ఆగకపోవడం వల్ల స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశ్వాపురంలో స్టేషన్ ఉన్నా, రైలు ఎక్కడానికి పక్క ఊర్లకు వెళ్లాల్సి రావడం సరికాదన్నారు.రైళ్లు ఆపడంతో పాటు స్టేషన్‌లో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని వారు ఎత్తిచూపారు.

**డిమాండ్లు:**

**రైళ్ల హాల్టింగ్:** అశ్వాపురం స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకోవాలి.

**ఫ్లాట్‌ఫారమ్‌నిర్మాణం:** ప్రయాణికులు సురక్షితంగా రైలు ఎక్కేందుకు వీలుగా ఫ్లాట్‌ఫారమ్‌ను ఆధునీకరించాలి. లైటింగ్ సదుపాయం: రాత్రి వేళల్లో ప్రయాణికుల రక్షణ కోసం స్టేషన్ పరిసరాల్లో, ఫ్లాట్‌ఫారమ్‌పై హైమాస్ట్ లైట్లు, తగినన్ని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.

**టికెట్ కౌంటర్:** ప్రయాణికులకు టికెట్లు స్థానికంగానే దొరికేలా తక్షణమే టికెట్ కౌంటర్ తెరవాలి.రైల్వే అధికారులు తక్షణమే స్పందించి రైల్వే స్టేషన్ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సర్పంచ్, ఉప సర్పంచ్ హెచ్చరించారు. ఈ విషయమై త్వరలోనే ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తామని వారు తెలియజేశారు.

# వామ్మో.. జూన్..!



- తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుంటున్న ప్రవేట్ పాఠశాలలు
- ఓవైపు బడి.. మరోవైపు ఖరీఫ్.
- పేద మధ్యతరగతుల కుటుంబాలపై భారం.
- ఫీజుల మోత.. నిత్యవసర ధరలకు రెక్కలు..
- అన్నదాతలకు సైతం సాగు పెట్టుబడులు.






**నేలకొండపల్లి, జూన్ 10 ప్రజా జ్యోతి :** జూన్ మాసం వచ్చిందంటే పిల్లలను బడికి పంపించే తల్లిదండ్రులకు, వ్యవసాయం చేసే రైతులకు భారీ ఖర్చులు ఉంటాయి. మరో వారం రోజుల్లో వేసవి సెలవులు ముగిసి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులకు ఫీజులు పెనుబారంగా మారుతున్నాయి. పిల్లల ఫీజులు, సాగు ఖర్చులు తలుచుకుంటే విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులకు కంటిమీద కునుకు ఉండడం లేదు. పేద మధ్యతరగతి రైతులకు ఈ మాసం గట్టెక్కేందుకు లక్ష రూపాయలు అప్పు చేయాల్సి వస్తుంది. తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివించాలని అత్యాశతో ఆయా తల్లిదండ్రులు అప్పుల పాలు కావలసిన పరిస్థితి ఏర్పడుతున్నాయి. నేలకొండపల్లి మండల పరిసర ప్రాంతాల లోని కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా పుట్టుకొస్తున్నాయి. ఆయా స్కూలు, కాలేజీలు వ్యాపార సంస్థలుగా మార్చేస్తున్నారు. తాము పడ్డ కష్టాలు తమ పిల్లలకు రావద్దని భావించి చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో చేరుస్తున్నారు. పిల్లల తల్లిదండ్రుల ఆశలను సొమ్ము చేసుకుని ప్రైవేట్ యజమాన్యాలు అందిన కాడికి దండుకుంటున్నాయి. ఎల్కేజీ, యూకేజీ చదువులకు ఏడాదికి 25 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. 1 నుంచి 5వ తరగతి వరకు 40 వేల రూపాయల వరకు ఆపై తరగతులను బట్టి ఫీజులు పెంచుతూ పోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. దీంతోపాటు పాఠశాలలోనే యూనిఫామ్, పుస్తకాలు, నోట్ బుక్స్, టై, షూ ఇలా అన్ని విక్రయాలు జరుపుతున్నారు. ఇరుకు గదులు, క్రీడా మైదానం లేకపోవడం, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, త్రాగునీరు తదితర సౌకర్యాలు లేనప్పటికీ ఫీజుల వసూళ్లలో మాత్రం వెనకాడడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

**అన్నదాతకు సాగు ఖర్చు: ఈ నెల ప్రారంభంలోనే తొలకరి వానజల్లులు** పడ్డాయి. సాగు కోసం ఇతరుల వద్ద అప్పు చేయాల్సిన పరిస్థితి రైతులది. ఎకరా సాగు చేయడానికి పదివేల రూపాయల నుంచి 15వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇంకా వీటికి కవులు అదనంగా భరించాల్సి వస్తుంది.

**యుద్ధం కారణంగా పెరిగిన డీజిల్ ఖర్చులతోపాటు** అధికంగా పెరుగుతున్న ఎరువుల ధరలు ఎరువులు విత్తనాలకు ఖర్చు అవుతుంది. దీనికి తోడు రోజురోజుకు పెరుగుతున్న గ్యాస్ ఖర్చులు పెనుబారం అవుతున్నాయి. ఈ నెల ప్రారంభం నుంచి డబ్బులు ఖర్చు చేసే పనులే ఉంటాయి. కనుక అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది.

# మదన్ లాల్ వారసురాలిగా తనయ రాజకీయ అరంగ్రేట్రమ్

- నాన్న తన రాజకీయ వారసురాలిగా ప్రకటించారు అంటున్న బానోత్ మనిషా లక్ష్మి
- ఐటీ రంగాన్ని ఒదిలి రాజకీయ రంగం వైపు అడుగులు



**వైరా జూన్ 9 ప్రజా జ్యోతి** రాజకీయాలలో కీ,,శే,, బానోత్ మదన్ లాల్ రాజకీయ ప్రస్థానం సుదీర్ఘమైనది. ఆయన విద్యార్థి దశ నుండే విద్యార్థి ఉద్యమాలలో నలిగిన నాయకుడు కమ్యూనిస్టు భావాజాలంతో ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. సర్పంచ్ స్థాయి నుండి ఎమ్మెల్యే వరకు ఎదిగారు. 2009లో వైరా నియోజకవర్గం ఎస్టీ రిజర్వుడు కావడంతో ఆయన రాజకీయ ప్రమోషన్ వైరా ప్రాంతంలో మొదలైంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మదన్ లాల్, ప్రజల సమస్యల పట్ల నిర్విరామంగా కృషి చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగిన కాలంలో వైరా భివృద్ధి కోసం పాటుపడ్డారు. గెలిచిన, ఓడిన ప్రజల మధ్య పనిచేసే నాయకుడిగా పేరు సంపాదించారు. మదన్ లాల్ మరణం తర్వాత ఆయన రాజకీయ వారసురాలిగా భానోత్ మనిషా లక్ష్మి రాజకీయ అరంగ్రేట్రం చేశారు. టీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం సూచన మేరకు, ఆమె వైరా నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ, అన్ని మండలాలను చుట్టేస్తున్నారు. వైరా, కారేపల్లి, కొనిజర్ల ఏనుకూర్, జూలూరుపాడు మండలాల్లో ప్రజలను నేరుగా కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజలకు ఎక్కడ ఆపదంటే, అక్కడికి వెళ్లి నేనున్నానంటూ, భరోసా ఇస్తున్నారు. స్థానిక సమస్యలపైన మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ప్రతిరోజు రెండు గ్రామాలను ఎంచుకొని, ఊరు సమస్యలు, వ్యక్తిగత ప్రజల అవసరాలు తెలుసుకుంటున్నారు. మదన్ లాల్ మరణం తర్వాత, టీఆర్ఎస్ పార్టీ మొదట ఆయన సతీమణి, మంజులకి పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడానికి సుముకుత వ్యక్తం చేసింది. వైరా నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జిగా కూడా నియమించడం జరిగింది. ఆమెకి రాజకీయ పరిణితి లేకపోవడం ప్రాథమిక చదువు మాత్రమే ఉండటం వల్ల భానోత్ మంజుల ప్రజల్లో చొరవగా దూసుకుపోలేకపోయారు. మదన్ లాల్ తనయ మనీషా లక్ష్మి పేరు తెరపైకి రావడంతో వైరా టీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం అలుముకుంది. ఆమె ప్రజల్లో తిరుగుతున్న తీరుని, చొరవని చూసి పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉత్సాహం పెరిగింది. సామాన్య ప్రజలతో సైతం కలుపుగోలుగా మాట్లాడుతూ, మహిళలను ఆలింగనం చేసుకుంటూ, ఇంటి ఆడబిడ్డలాగా సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. తండ్రికి తగ్గ తనయగా మమేకమవుతున్నారని ప్రజల్లో చర్చ జరుగుతుంది. మనిషా లక్ష్మి బిటెక్ పూర్తి చేసి ఐటి రంగంలో కొంతకాలం పని చేశారు. ఆమె భర్త సెంట్రల్ మైనింగ్ లిమిటెడ్ కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తున్నారు. మనీషా తన ఐటీ రంగం మీద వచ్చే లక్షలాది ఆదాయన్ని కాదనుకొని తండ్రి ఆశయ సాధన కోసం ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చానని ఆమె ప్రజా జ్యోతి కి తెలియజేశారు. నాన్న వారసురాలిగా నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై ఉంటానని అన్నారు. వైరా నియోజకవర్గ ప్రజలకు మా కుటుంబంపైన అపారమైన అభిమానం ఉన్నదని ఆమె అన్నారు. రాబోవు ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రజల అభిమానాన్ని, ప్రేమను పొందుతానని తెలియజేశారు. తన తండ్రిలాగానే వైరా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

# ధరల మోతపై సీపీఐ గర్జన

- కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదల పొట్టకొడుతున్న కేంద్రం
- ఇంధన, గ్యాస్ ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు
- ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేస్తాం: ఎమ్మెల్యే కూనంనేని









**కొత్తగూడెం, జూన్ 10 ( ప్రజాజ్యోతి )** కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారాలు మోపుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పెంచిన ఇంధన, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని నిత్యావసర వస్తువుల ధరలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన భారీ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ధనవంతులకు ఊడిగం చేస్తూ పేద ప్రజల నడ్డి విరుస్తోందని ఆయన మండిపడ్డారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల ప్రభావంతో సాధారణ కుటుంబాల జీవనం భారంగా మారిందన్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ సామాన్య ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న పాలకుల తీరును ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. పెంచిన ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిఘటన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, కె. సారయ్య, మున్నా లక్ష్మికుమారి, చంద్ర నరేంద్ర కుమార్, వి. పూర్ణచందర్‌రావు, జి. వీరాస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, భూక్యా దస్రు, యు. రాహుల్, ఎస్కే ఫహీమ్, వివిధ మండలాల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ కొత్తగూడెంలో ప్రజా పాలన గ్రామసభ





**చర్ల ,జూన్ 10 :(ప్రజాజ్యోతి):** చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీలో బుధవారం 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా 'స్వచ్ఛ భద్రాద్రి' కార్యక్రమం కింద ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.గ్రామసభకు తొలిసారిగా హాజరైన చర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావును సర్పంచ్ రవి కుమార్, వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దుకాణదారులు తమ వ్యర్థాలను ప్రత్యేకంగా నిల్వ ఉంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని కోరారు.ఇళ్లలో ఉత్పత్తి అయ్యే తడి, పొడి, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి పంచాయతీకి అందించాలని సూచించారు. గ్రామ పరిశుభ్రతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ సందర్భగా ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సురక్షిత తాగునీటి వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణతో పాటు మొక్కల పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, సీనియర్ నాయకులు ఇందుల రమేష్, జోగిరాజు, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, పంచాయతీ కార్యదర్శి శోభారాణి, వార్డు సభ్యులు కొమరం భద్రయ్య, కణితి రజిని, చింతకాయల స్వరూప, పాయం లక్ష్మి, కారం సుధాకర్, దానవాయిపేట చింతకాయల హరిబాబు, మండల అధికారులు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిత్రపరిశ్రమ గొప్ప దర్శకుడిని కోల్పోయింది

### నటి ఖుష్బూ సుందర్ భావోద్వేగ పోస్ట్

చెన్నై,జూన్10(ప్రజాజ్యోతి): లెజెండరీ దర్శకుడు భారతీరాజా మరణ వార్తతో దక్షిణాది సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. భారతీరాజాతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగ సందేశాలు పంచుకుంటున్నారు. ఈ క్రమంలో సీనియర్ నటి కుష్బూ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. భారతీరాజా మరణం తనను తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసిందని ఆమె పేర్కొన్నారు. తమిళ సినీ పరిశ్రమ ఒక గొప్ప దర్శకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పోస్ట్‌లో కుష్బూ మాట్లాడుతూ.. మనందరికీ ఎంతో ఇష్టమైన దర్శకుడు భారతీరాజా ఇక లేరనే వార్త నమ్మలేకపోతున్నాను. ఆయన మరణం తమిళ సినీ పరిశ్రమకు తీరని లోటు. ఆయన రూపొందించిన సినిమాలు ఒక ప్రమాణంగా నిలిచాయి. భవిష్యత్తులో వచ్చే తరాల దర్శకులకు, సినిమా ప్రేమికులకు ఆయన చిత్రాలు ఒక మార్గదర్శకంగా నిలుస్తాయి' అని పేర్కొన్నారు. భారతీరాజాతో తనకు ఉన్న ఓ మధుర జ్ఞాపకాన్ని కూడా కుష్బూ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నన్ను రెండు జడలతో చూపిస్తూ ఒక అందమైన సినిమా చేయాలని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. ఆ ప్రాజెక్ట్ గురించి చాలాసార్లు మాట్లాడేవారు. కానీ ఇప్పుడు ఆ కల ఇక ఎప్పటికీ నెరవేరని కలగానే మిగిలిపోయింది అంటూ భావోద్వేగానికి గురయ్యారు. కుష్బూ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అభిమానులు కూడా ఆమె పోస్ట్‌కు స్పందిస్తూ భారతీరాజా గురించి తమ జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. గ్రామీణ నేపథ్య కథలకు కొత్త అర్థం చెప్పిన దర్శకుడిగా భారతీరాజా ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రేమ, కుటుంబ బంధాలు, మానవ సంబంధాలను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించిన ఆయన చిత్రాలు తరతరాల ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. భారతీరాజా మరణంతో ఒక గొప్ప దర్శకుడి యుగానికి ముగింపు పలికినట్లైందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆయన సృష్టించిన పాత్రలు, తెరకెక్కించిన కథలు, తెలుగు-తమిళ సినీ పరిశ్రమలకు అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అభిమానులు పేర్కొంటున్నారు.

## భారతీరాజా మృతి తీరని లోటు

### ఆయన దర్శకత్వంలో నటించడం గొప్ప అనుభూతి

### నివాళి అర్పించిన మెగాస్టార్ చిరంజీవి

హైదరాబాద్,జూన్10(ప్రజాజ్యోతి): విలక్షణ కథాంశాలతో యావత్ దేశాన్ని మెప్పించిన ఈ 'దర్శక శిఖరం' భారతీరాజా మరణవార్తతో అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి. ఆయన భౌతికకాయానికి నివాళులర్పించేందుకు సినీ ప్రముఖులు, అభిమానులు భారీగా



తరలివచ్చారు. ఈ విషాద సమయంలో మెగాస్టార్ చిరంజీవి సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ అత్యంత ఎమోషనల్ అయ్యారు. భారతీయ చలనచిత్ర రంగం ఇవాళ ఒక అసాధారణ కథకుడిని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెటూరి మట్టి పరిమళాలను, అచ్చమైన మానవ సంబంధాల సున్నితత్వాన్ని, అమాయకత్వంతో కూడిన ప్రేమను, సామాన్యుల జీవితాల్లోని భావోద్వేగాలను వెండితెరపై అద్భుతమైన కావ్యాలుగా మలిచిన ఘనత భారతీరాజా గారికే దక్కుతుందని చిరంజీవి కొనియాడారు. ఆయన సృష్టించిన చిత్రాలు కేవలం ప్రేక్షకులను అలరించడమే కాకుండా, రాబోయే ఎన్నో తరాల యువ దర్శకులకు దిక్సూచిలా, స్ఫూర్తిప్రదాతగా నిలిచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1987లో భారతీరాజా గారి దర్శకత్వంలో వచ్చిన క్లాసిక్ ఎమోషనల్ డ్రామా 'ఆరాధన' చిత్రంలో తామిద్దరం కలిసి పనిచేసిన మధుర జ్ఞాపకాలను చిరంజీవి ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఆ సినిమాలో తాను పోషించిన 'పులిరాజు' అనే వైవిధ్యమైన పాత్ర తన కెరీర్‌లో ఎప్పటికీ ప్రత్యేకమని, అటువంటి గొప్ప పాత్రను తనతో చేయించిన అదృష్టం ఆ దర్శకేంద్రుడి వల్లే దక్కిందని చెప్పారు. షూటింగ్ సమయంలో సినిమా పట్ల భారతీరాజా గారికి ఉన్న ప్యాషన్, ఆయన చూపించిన అంకితభావం, అంత పెద్ద దర్శకుడైనా ఆయనలో ఉన్న నిరాడంబరత్వం తన మనసుపై ఎనలేని ముద్ర వేశాయని మెగాస్టార్ గుర్తుచేసుకున్నారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయన భౌతికంగా మనల్ని విడిచివెళ్లినా ఆయన చిత్రాల ద్వారా ఎప్పటికీ చిరస్మరణీయంగానే ఉంటారని పేర్కొంటూ, శోకతప్త కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నిఘానేత్రంలో ఆదిలాబాద్ జిల్లా

### 300 నూతన సీసీటీవీ కెమెరా లను ప్రారంభించిన రాష్ట్ర డీ జీపీ సి.వి. ఆనంద్

### ప్రజల భద్రత, నేర నియంత్రణ లో సాంకేతికత కీలకం

ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 10, (ప్రజా జ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల భ ద్రతను మరింత బలోపేతం చే యడం, నేరాల నియంత్రణ, విచారణను సమర్థవంతంగా





నిర్వహించడం కోసం ఏర్పా టు చేసిన 300 నూతన సీసీ టీవీ కెమెరాలను రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ బుధ వారం ఉదయం స్థానిక క మాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రా రంభించారు.

మొదటగా స్థాని క పోలీస్ గెస్ట్ హౌస్ వద్ద జిల్లా సాయుధ సిబ్బంది గౌరవ వం దనాన్ని సమర్పించారు. అనం తరం ప్రాంగణంలో ఒక మొక్క ను నాటి పచ్చదనం ప్రాము ఖ్యతను తెలియజేశారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కెమెరాలలో 220 సీసీటీవీ కె మెరాలు గ్రామీణ ప్రాంతాల లో, 80 సీసీటీవీ కెమెరాలు పట్టణ ప్రాంతంలో నూతనం గా ఏర్పాటు చేశారు. ఈ కెమె రాల ద్వారా ప్రజల రక్షణ, ట్రా ఫిక్ పర్యవేక్షణ, నేరాల నివార ణ, నిందితుల గుర్తింపు వంటి అంశాలలో పోలీసు శాఖకు మరింత సహకారం అందనుం ది.ఈ సందర్భంగా రాష్ట్ర డీజీ పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అం దించేందుకు తెలంగాణ పోలీ స్ శాఖ కట్టుబడి ఉందని తెలి పారు.ఈ కార్యక్రమంలో ఉ మెన్ సేఫ్టీ, సీఐడీ, ఏసీబీ డీజీ చారు సిన్హా ఐపీఎస్, మల్టీ జో న్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రె డ్డి ఐపీఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్, అదనపు ఎస్పీ (అడ్మిన్) పి. మౌనిక ఐ పీఎస్, ఉట్నూర్ ఏఎస్పీ రు త్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆ దిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, పట్టణ సీఐ బి. సునీల్ కుమార్, పోలీసు అధికారు లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర కాలంలో అనేక మార్పులు

మొదటిపేజీ తరువాయి..

అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు




తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.

సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తెలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# గంజాయి నిర్మూలన, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాలి

### తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్

### తోషం గ్రామసభలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ

ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 10, (ప్రజా జ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా, రోడ్డు ప్రమాదా ల నివారణకు కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర డిజిపి బి.వి ఆనంద్ పిలుపు నిచ్చారు. ప్రజా పాల న ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని గుడి హత్నూర్ మండలం



తోషం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ పాల్గొన్నారు.గ్రామ సభ ప్రారంభానికి ముందు ఆదివాసి సంస్కృతి, సంప్రదా యాల ప్రకారం గ్రామ పెద్దలు, గ్రామస్తులు డీజీపీకి ఘన స్వా గతం పలికారు. అనంతరం కొ మరం భీం విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా గుస్సాడి కళాకారులు సంప్రదాయ నృ త్య ప్రదర్శన లతో అతిథులను ఆహ్వానిస్తూ కార్యక్రమం కొన సాగింది. ఈ సందర్భంగా గ్రా మస్తులు, ఆదివాసీల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాలతో పాటు కుటుంబాలు, సమాజంపై కూ డా ప్రతికూల ప్రభావం చూపు తాయని తెలిపారు. యువత విద్య, క్రీడలు, ఉపాధి అవకా శాలపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూ చించారు.ఈ సందర్భంగా 30 మంది ఆటో డ్రైవర్లకు ప్రమా ద సమయంలో ఉపయోగ ప డే ప్రథమ చికిత్స కిట్లను పం పిణీ చేశారు. ప్రమాదాల సమ యంలో రక్తస్రావాన్ని నియం త్రించి ప్రాణాలను కాపాడ దం లో ఈ కిట్లు ఎంతో ఉపయోగ కరమని తెలిపారు. అదేవిధం గా తోషం, తోషం తాండా, రా గాపూర్, బోర్రమద్ది, పూనగూ డ, తోయిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ ఐ దు వాలీబాల్ కిట్లను అందజే శారు.ఈగ్రామసభలో పాల్గొన్న సుమారు 200 మంది ప్రజల కు హెల్మెట్లను పంపిణీ చేసి, హెల్మెట్ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించా రు. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వా హనం నడిపే సమయంలో త ప్పనిసరిగా హెల్మెట్ ధరించా లని, రోడ్డు భద్రతా నియమా లు పాటించాలని సూచించా రు. అలాగే కార్లలో ప్రయాణిం చే సమయంలో సీట్ బెల్ట్ త ప్పనిసరిగా ధరించాలని తెలి పారు. అరైవ్ అలైవ్ కార్యక్ర మంలో భాగంగా నిర్వహించి న ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథ మ,





ద్వితీయ, తృతీయ బ హుమతులను అందజేశారు. రోడ్డు భద్రతపై కుటుంబ స భ్యుల్లో అవగాహన కల్పించ డంలో మహిళల పాత్ర కీలక మని, వాహనాలు నడిపే వా రు హెల్మెట్లు ధరించేలా ప్రోత్స హించాలని సూచించారు. యువతలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలనే సదుద్దేశంతో నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో పాల్గొన్న 75 మంది యువతకు లర్నింగ్ లైసెన్సు లను అందజేశారు. ప్రతి వా హనదారుడు చెల్లుబాటు అ య్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. గ తంలో లొంగిపోయిన ముగ్గు రు మావోయిస్టులకు ఇళ్ల ప ట్టాలను అందజేశారు. ఈ కా ర్యక్రమంలో మల్టీజోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీ ఎ స్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐ ఏ ఎస్, జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ ఐపీఎస్, అదనపు ఎ స్పీ (అడ్మిన్) పి. మౌనిక ఐపీ ఎస్, ఉట్నూర్ ఏఎస్పీ రుత్వి క్ సాయి కొట్టే ఐపీఎస్, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, ప్రజ లు, ఇతర అధికారులు పాల్గొ న్నారు.

# అభివృద్ధి జరగొద్దని కుట్రలు

మొదటిపేజీ తరువాయి..

నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎర్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు.



అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎర్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు.

నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# 2027 వేసవి నాటికి మెడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పూర్తి

మేడిగడ్డ,జూన్ 10 (ప్రజాజ్యోతి): మెడిగడ్డ బ్యారేజ్‌తో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను అత్యంత శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి 2027 వేసవి నాటికి పూర్తిచేసి తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మెడిగడ్డ బ్యారేజ్ వద్ద జరుగుతున్న సాంకేతిక పరిశోధనలు, హైడ్రాలజికల్ అధ్యయనాలు, జియోటెక్నికల్ పరీక్షలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ సర్వేలు మరియు పునరుద్ధరణ ప్రణాళికల పురోగతిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూలై తొలి వారానికి అన్ని సాంకేతిక, హైడ్రాలజికల్ అధ్యయనాలు పూర్తవుతాయని, అనంతరం సేకరించిన నివేదికలను కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థలకు పంపుతామని తెలిపారు. వాటి సూచనల మేరకు 2026 సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లను ఖరారు చేస్తామని చెప్పారు. వర్షాకాలం ముగిసిన వెంటనే నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ తొలి వారంలో పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని, ఒకే పని సీజన్‌లో పనులు పూర్తి చేసి 2027 వేసవి నాటికి బ్యారేజీలను తిరిగి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు. హైడ్రాలజికల్ అధ్యయనాలతో పాటు జియోటెక్నికల్ బోర్‌హోల్ పరిశోధనలు, ఇతర సాంకేతిక పరీక్షలను వేగవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్యారేజీల్లో ఉఖీ పరీక్షలు 90 శాతం వరకు పూర్తయ్యాయని, బోర్‌హోల్ మరియు జియోటెక్నికల్ పరిశోధనలు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. జూన్ చివరి నాటికి అన్ని పరీక్షలు, పరిశోధనలు పూర్తవుతాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఈ తరహా నష్టం పునరావృతం కాకుండా ఉండేందుకు 40 నుంచి 80 మీటర్ల లోతు వరకు బోర్‌హోల్స్ తవ్వి భూగర్భ పరిస్థితులపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. కేంద్ర జల సంఘం, జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థల ఆమోదం వచ్చిన తర్వాతే పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలకుల తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట విధానాలు, నిర్మాణ లోపాల కారణంగానే మెడిగడ్డతో పాటు ఇతర బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2023 అక్టోబర్‌లో జరిగిన నష్టం గత ప్రభుత్వ హయాంలోనే జరిగింది. అనంతరం నిర్వహించిన విచారణల్లో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ, న్యాయ కమిషన్ పలు నిర్మాణ, డిజైన్, నిర్వహణ లోపాలను గుర్తించాయని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38,000 కోట్ల అంచనా వ్యయంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించిందని గుర్తు చేశారు. 2014 నాటికే దాదాపు మూడోవంతు పనులు పూర్తయ్యాయని చెప్పారు. అదే ప్రాజెక్టును కొనసాగించి ఉంటే



2016-17 నాటికే పూర్తయి సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-డిజైన్ పేరుతో ప్రాజెక్టు అంచనాలను భారీగా పెంచిందని విమర్శించారు. రూ.38,000 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం లక్ష కోట్ల రూపాయలు దాటిందని, కాగ్ అంచనాల ప్రకారం అది రూ.1.45 లక్షల కోట్ల వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు. ఇంత భారీ ప్రజాధనం ఖర్చు చేసినప్పటికీ 2023 డిసెంబర్ 7 తర్వాత మూడు బ్యారేజీలు వినియోగంలో లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన పరిణామంగా ఆయన అభివర్ణించారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల తెలంగాణ ప్రజలపై, రాష్ట్ర ఖజానాపై భారీ భారం పడిందని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించిందని ఆయన పేర్కొన్నారు. ÷ునరుద్ధరణ డిజైన్ల కోసం ప్రపంచ ప్రఖ్యాత కన్సల్టెంట్ సంస్థ , ఐఐటీ బొంబాయితో కలిసి నియమించామని ఆయన తెలిపారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967